MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 315 | పేజీలు : 8 | బుధవారం 4 నవంబర్ 2026 | వెల : 6-00

- ఈవీఎం ఎన్నికల్లోనే కాదు.. బ్యాలట్ పోరులోనూ కూటమిదే ఘన విజయం
- అభివృద్ధి, సంక్షేమానికి ఓటర్ల బ్రహ్మరథం
- వైకాపా ఘోర పరాజయం
- కడప జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్
- పులివెందులలోనూ తిరగని ఫ్యాన్
- గుంటూరు మేయర్ స్థానంలో తెదేపా భారీ విజయం
- విజయవాడలో లక్ష ఓట్ల మెజారిటీతో దూసుకెళ్తున్న జనసేన



పురపోరులో కూటమి సునామీ



పురపోరులో పసుపు జెండా రెపరెపలు.. అన్ని కార్పొరేషన్లలో కూటమి హవా!

ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి ప్రభంజనం సృష్టిస్తోంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో ఆధిక్యం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా 13 నగరపాలక సంస్థల్లోనూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ కూటమి అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తున్నారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో ఆధిక్యం లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది. 2021 మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆధిపత్యం ప్రదర్శించిన వైసీపీకి ప్రస్తుత ఎన్నికల ఫలితాల సరళి భిన్నమైన రాజకీయ పరిస్థితులను సూచిస్తోంది.

అమరావతి

అధికార కూటమి మరోసారి అఖండ విజయం సాధించింది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తెదేపా, జనసేన భాజపా కూటమి సూపర్ హిట్టయింది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటి గెలుపును మరిపించేలా.. ఉత్తరాంధ్ర, మధ్యాంధ్ర, రాయలసీమ అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ కూటమి విజయకేతనం ఎగరేసింది. 2024 నాటి ఈవీఎంల్లోనే కాదు.. 2026లో బ్యాలట్ పోరులోనూ తమది తిరుగులేని గెలుపని చాటిచెప్పింది. వైకాపా ఘోర పరాజయం పాలైంది. రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థలు, 77 పురపాలక సంఘాలు, 10 నగర పంచాయతీలకు కలిపి 100 చోట్ల ఎన్నికలు జరిగితే.. తుది ఫలితాలు వెల్లడయ్యేసరికి నందికొట్కూరు, నాయుడుపేట, బేతంచెర్లల్లోనే వైకాపా గెలిచింది. విశాఖ మేయర్‌గా తెదేపా అభ్యర్థి ముక్కా శ్రావణి 2,44,644 ఓట్ల బంపర్ మెజారిటీతో బావుటా ఎగరేశారు. గుంటూరులో తెదేపా అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ 96,294 ఓట్ల అధిక్యతతో మేయర్ పదవిని కైవసం చేసుకున్నారు. విజయవాడ మేయర్ స్థానం ఓట్ల - మిగతా 2లో

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!



- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్
- చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం
- ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ
- ఎన్నికల సంస్కరణల అవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య

అమరావతి, మహానగర్


ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో - మిగతా 2లో

ఆయుధాల తయారీలో భారత్ దూకుడు

- రక్షణ రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యం..
- 2029 నాటికి రూ.3 లక్షల కోట్ల ఉత్పత్తులు!
- రూ.50 వేల కోట్లకు రక్షణ ఎగుమతులు పెంచడమే ధ్యేయం
- పదేళ్లలో భారీగా పెరిగిన దేశీయ రక్షణ ఉత్పత్తులు
- రూ.7.85 లక్షల కోట్లకు చేరిన రక్షణ బడ్జెట్
- సైనిక ఆధునికీకరణకు కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యం

5





వరుస తుఫాన్లతో రాష్ట్రానికి భారీ నష్టం

తుఫాను సాయంపై కేంద్రానికి విజ్ఞప్తి


కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ

హోం మంత్రితో ఒకే రోజు రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడిన సీఎం

తుఫాన్ల ప్రభావం, పంట, ఆస్తి నష్టం, సహాయక చర్యల గురించి వెల్లడి

అమరావతి, మహానగర్

అర్నబ్, మురసు తుఫాన్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. తుఫాను కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సంభవించిన పంట, ఆస్తి నష్టంతో పాటు ప్రజలకు కలిగిన ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను వివరిస్తూ కేంద్ర మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి లేఖ రాశారు. రాష్ట్రానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని తక్షణమే అందించాలని విజ్ఞప్తి చేశారు. మురసు తుఫాను ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర మంత్రి ఫోన్ చేశారు. రాష్ట్రంలో తుఫాను - మిగతా 2లో



రామ మందిరం విరాళాల కేసుపై స్వతంత్ర విచారణ జరపాలి

- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్
- 105 చోరీ ఘటనలు.. రూ.79.85 లక్షల రికవరీపై జైరాం రమేశ్ ప్రశ్నలు
- 2020 ఆడిట్ నివేదికలోని లోపాలపైనా విచారణ జరపాలని సూచన

5




నిరసనలకు హద్దులు ఉండాలి

- ఒకే వేదికపై నిరవధిక ఆందోళనలు ఎలా?: సుప్రీంకోర్టు
- నిరసన హక్కుతో పాటు ఇతరుల ప్రయోజనాలూ ముఖ్యం
- రామ్‌లీలా మైదానం ఆందోళనలపై వ్యాపార సంఘాల పిటిషన్
- నిరసన నిర్వాహకులను కూడా ప్రతివాదులుగా చేర్చాలని సూచన

చిన్న పట్టణాలే రేపటి ఆర్థిక శక్తులు

- చిన్న పట్టణాలే అభివృద్ధి చోదకశక్తులు..
- వందలాది సిటీలను గ్రోత్ హబ్‌లుగా మార్చాలి
- పట్టణాభివృద్ధికి రూ.లక్ష కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్
- రూ.21,800 కోట్ల పుణె మెట్రో ప్రాజెక్టు ప్రారంభం
- 26 నగరాలకు విస్తరించిన మెట్రో సేవలు..

5



మురసు తుపాను బలహీనం

- తీరం దాటిన తీవ్ర తుపాను.. పలు జిల్లాలకు వర్ష సూచన
- ఒంగోలు సమీపంలో తీరం దాటిన మురసు
- 80--90 కి.మీ. వేగంతో గాలులు.. 100 కి.మీ. వరకు ఈదురుగాలులు
- బాపట్లకు 40 కి.మీ. దూరంలో కేంద్రీకృతం



అమరావతి:

ఆంధ్రప్రదేశ్‌ను వణికించిన మురసు తీవ్ర తుపాను తీరం దాటినప్పటికీ రాష్ట్రానికి వర్షాల ముప్పు పూర్తిగా తొలగిపోలేదు. తుపాను క్రమంగా బలహీనపడుతున్నా పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ - మిగతా 2లో

పురపోరులో కూటమి సునామీ

-మొదటిపేజీ తరువాయి

లెక్కింపులో మంగళవారం రాత్రి 1.30 గంటల సమయానికి కూటమి తరఫున జనసేన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ 1.24 లక్షల భారీ ఆధిక్యంతో కొనసాగుతున్నారు. ఇక్కడ వైకాపా రెండో స్థానంలో ఉండగా స్వతంత్ర అభ్యర్థి ఏబీ వెంకటేశ్వరరావుకు దాదాపు 12 వేల ఓట్లు వచ్చాయి. అనంతపురం కార్పొరేషన్‌లో వైకాపా స్వల్ప ఆధిక్యంలో ఉంది. ఆదోని మున్సిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయతీల్లో కూటమి తిరుగుబాటు అభ్యర్థులు గెలిచారు. భారీ వర్షంతో చీరాలలో కౌంటింగ్ వాయిదా పడింది. ఒంగోలులో మంగళవారం రాత్రి 12 గంటల తర్వాత లెక్కింపు ప్రక్రియ మొదలైంది. వైకాపా అధ్యక్షుడు జగన్ సొంత నియోజకవర్గ కేంద్రమైన పులివెందుల మున్సిపాలిటీలోనూ ఆ పార్టీకి పరాభవం తప్పలేదు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకుగాను వైకాపా 11 (6.29 శాతం) గెలిచింది. కడపటి వార్తలందేసరికి పుర ఎన్నికల్లో 100కిగాను 3 మున్సిపాలిటీలకే (3 శాతం) పరిమితమై మరింత ఘోర పరాజయం మూటగట్టుకుంది. అనంతపురంలో గెలిచినా ఆ శాతం సార్వత్రిక ఎన్నికల కంటే తక్కువే.

నగరమైనా, పట్టణమైనా ఓటు కూటమికే!

నగరం, పట్టణం తేడా లేకుండా పుర జనం కూటమికే పట్టం కట్టారు. 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో 17 చోట్ల ఛైర్‌పర్సన్ అభ్యర్థుల్ని కూటమి ఏకగ్రీవంగా గెలుచుకుంది. వీటిలో 8 చోట్ల ఛైర్‌పర్సన్ అభ్యర్థులతో పాటు, మొత్తం వార్డులన్నీ ఏకగ్రీవమయ్యాయి.


13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఈ నెల 1న పోలింగ్ జరిగింది. విశాఖపట్నం, విజయనగరం, మచిలీపట్నం, ఏలూరు, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, కడప కార్పొరేషన్లను కూటమి కైవసం చేసుకుంది. జనసేన పోటీ చేసిన రెండు మేయర్ స్థానాల్లో ఏలూరులో గెలిచింది. విజయవాడలో భారీ విజయం దిశగా దూసుకుపోతోంది. భాజపా పోటీ చేసిన అనంతపురంలో వైకాపా స్వల్ప ఆధిక్యంలో ఉంది. మిగతా స్థానాల్లో తెదేపా గెలిచింది.

దాచేపల్లి, పిడుగురాళ్ల, గురజాల, నగరి, దర్శి, కనిగిరి, బద్వేలు, ప్రొద్దుటూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, మైదుకూరు, రాజంపేట, పుంగనూరు, రాయచోటి, గుత్తి, ఆళ్లగడ్డ, ఆత్మకూరు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాల్ని కూటమి ఏకగ్రీవంగా గెలుచుకుంది. వీటిలో దర్శి జనసేనకు, ఎర్రగుంట్ల భాజపాకు ఏకగ్రీవమయ్యాయి.

జనసేన 15 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ పదవులకు పోటీపడింది. 100% స్ట్రైక్‌రేట్‌తో అన్ని స్థానాల్లోనూ విజయధ్వంకా మోగించింది.

భాజపా పోటీ చేసిన వాటిలో నాలుగు మున్సిపాలిటీల్లో గెలిచింది. నెల్లిమర్ల నగర పంచాయతీలో భాజపా అభ్యర్థిపై తిరుగుబాటు అభ్యర్థి గెలుపొందారు.

మొత్తం 13 కార్పొరేషన్లలో 922 డివిజన్లకు గాను 118 ఏకగ్రీవమయ్యాయి. 804 స్థానాలకు ఎన్నికలు



జరిగాయి.

87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 3020 వార్డులకు గాను 637 ఏకగ్రీవమయ్యాయి. 2,382 చోట్ల ఎన్నికలు జరిగాయి. నంద్యాల జిల్లా ఆత్మకూరులోని 20వ వార్డులో అభ్యర్థులెవరూ లేకపోవడంతో ఎన్నిక నిర్వహించలేదు. కడపటి వార్తలందేసరికి.. తెదేపా 1298, జనసేన 298, భాజపా 81, వైకాపా 367 గెలుపొందాయి. రెబల్స్, స్వతంత్రులు 87 చోట్ల గెలిచారు.

వైకాపాకు కోలుకోలేని దెబ్బ!

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపాకు కోలుకోలేని దెబ్బ తగిలింది. 22 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైకాపా అసలు బోణీ కొట్టలేదు. జగన్ సొంత జిల్లా వైఎస్సార్ కడపలో కూటమి క్లీన్‌స్వీప్ చేసి చావుదెబ్బ కొట్టింది. ఎర్రగుంట్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు, బద్వేలు, రాజంపేట, కమలాపురంలలో ఛైర్‌పర్సన్ స్థానాలు కూటమికి ఏకగ్రీవమయ్యాయి. ఎన్నిక జరిగిన కడప కార్పొరేషన్ మేయర్‌తో పాటు, పులివెందుల, జమ్మలమడుగు ఛైర్‌పర్సన్ స్థానాల్నీ కూటమే గెలుచుకుంది. జగన్ సొంత నియోజకవర్గ కేంద్రం పులివెందులలోనూ వైకాపాకు ఘోర పరాజయం ఎదురైంది. ఛైర్‌పర్సన్ స్థానంతో పాటు, 37 వార్డుల్ని కూటమి కైవసం చేసుకుంది. వైకాపా చచ్చీచెడీ 3 వార్డుల్లో గెలిచింది.

2చోట్ల రెబల్స్ గెలుపు

కర్నూలు జిల్లా ఆదోనిలో కూటమి తరఫున తెదేపా అభ్యర్థి పోటీ చేయగా జనసేన రెబల్ అభ్యర్థి స్వప్ననాయకర్ విజయం సాధించారు. అభ్యర్థి భర్తపై ఉన్న సానుభూతి.. భాజపా, వైకాపా నేతల పరోక్ష సహకారంతో ఆయన భార్యను గెలిపించుకోగలిగారు. నెల్లిమర్లలో కూటమి తరఫున భాజపా అభ్యర్థి మైపాడు ప్రసాద్‌పై తెదేపా పట్టణ అధ్యక్షుడు లెంకా అప్పలనాయుడు రెబల్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. కూటమి అభ్యర్థి అనుకున్న అప్పలనాయుడికి టిక్కెట్ దక్కకపోవడం వల్ల వచ్చిన సానుభూతి, స్థానిక ఎమ్మెల్యే వ్యవహారశైలి కూడా ఆయన విజయానికి దోహదం చేసింది.

విజయవాడలో తెలిపోయిన ఏబీవీ

త్రిముఖ పోటీ అని ప్రచారం జరిగిన విజయవాడలో స్వతంత్ర అభ్యర్థి, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు నామమాత్రపు పోటీ కూడా ఇవ్వలేకపోయారు. కడపటి వార్తలందేసరికి ఆయనకు వచ్చిన ఓట్లు దాదాపు 12వేలు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసిన ఆయనను ప్రజలు తిరస్కరించారు.

కూటమి విజయం అసాధారణం

వైకాపా అధికారంలో ఉండగా 2021లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా దర్శి, కొండపల్లి, తాడిపత్రిల్లో మాత్రమే గెలిచినా, అప్పట్లో వైకాపా గెలుపు ఏకపక్షమైనా.. ఆ ఎన్నికల్నీ, ఈ ఎన్నికల్నీ పోల్చలేం. అప్పట్లో వైకాపా అధికారాన్ని అడ్డుపెట్టుకుని తీవ్రస్థాయిలో అరాచకాలకు, దాడులకు, బెదిరింపులకు పాల్పడింది. అన్నిచోట్లా పోలీసులతో బెదిరింపులు, అక్రమ కేసులు, అరెస్టులతో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల్ని భయభ్రాంతుల్ని చేసి, ఎన్నికలను ఏకపక్షం చేసుకుంది. ఈ ఎన్నికల్లో వివాదాలు, ఘర్షణలున్నా అవి కొన్ని ప్రాంతాలకే పరిమితం. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో ఇప్పుడు ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో గెలిచాయి. అధికారపక్షం బెదిరింపులకు, బలప్రయోగాలకు దిగకుండానే గెలిచింది. బహుశా దేశంలోని మరే రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంత ఏకపక్ష విజయం సాధించి ఉండదు.

వరుస తుఫాన్లతో రాష్ట్రానికి భారీ నష్టం

-మొదటిపేజీ తరువాయి

పరిస్థితులు, జరిగిన నష్టం, సహాయక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. ఒకే రోజు రెండుసార్లు అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ముఖ్యమంత్రి, వరుస తుఫాన్ల కారణంగా రాష్ట్రానికి ఎదురైన నష్టాన్ని వివరించారు. అర్నబ్ తుఫాను ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోకముందే మురసు తుఫాను కారణంగా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయని సీఎం వివరించారు. మురసు తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని ఎనిమిది శాఖలకు సంబంధించి ప్రాథమికంగా సుమారు రూ.343.95 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ముఖ్యమంత్రి కేంద్ర హోంమంత్రికి వివరించారు. ఇందులో దాదాపు 94 శాతం నష్టం వ్యవసాయ రంగంలోనే ఉందని తెలిపారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 465 గ్రామాల పరిధిలో 50,473 హెక్టార్లలో పంటలు దెబ్బ తిన్నాయని, 69,828 మంది రైతులు ప్రభావితమయ్యారని వివరించారు. వీటిలో 45,900 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని, వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రాథమికంగా రూ.324.22 కోట్ల నష్టం అంచనా వేసినట్లు తెలిపారు. బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పంట నష్టం అధికంగా ఉందని, ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయని వివరించారు. తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, అత్యవసర కార్యకలాపాల కేంద్రాలను అప్రమత్తం చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరావాస చర్యల కోసం 11 ఎస్‌డీఆర్ఎఫ్, 13 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే సిద్ధం చేశామని తెలిపారు. ప్రభావిత జిల్లాల్లో 480 పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12,230 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వివరించారు. తుఫాను నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందాన్ని పంపినందుకు అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న అనంతరం పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్, సాగునీటి పనరులకు జరిగిన నష్టంపై సమగ్రంగా అంచనాలు రూపొందించి పూర్తి స్థాయి నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని వెల్లడించారు. వరుస తుఫాన్ల కారణంగా రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు కేంద్రం అవసరమైన సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో తుఫాను ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో నష్టాలపై సమగ్ర అంచనాలు రూపొందించే ప్రక్రియను పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన వెంటనే చేపడతామని సీఎం తన లేఖలో పేర్కొన్నారు.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!



-మొదటిపేజీ తరువాయి

అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..

జగన్ విధ్వంసానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి చారిత్రాత్మక విజయం సాధించడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ విధ్వంసకర, అరాచక పాలనను ప్రజలు తమ ఓటుతో నిర్ద్వంద్వంగా తిరస్కరించారని, కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గెలుపు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ల సమష్టి నాయకత్వంపై ప్రజలు ఉంచిన అచంచల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొచ్చిందని పెమ్మసాని వివరించారు. పేదలకు ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు, దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులు, వికలాంగులకు అందిస్తున్న రూ.4,000, రూ.6,000 పెన్షన్లు, 'తల్లికి వందనం', 'దీపం', 'అన్నదాత సుఖీభవ' వంటి పథకాల ద్వారా సుమారు రూ.1,50,000 కోట్ల సంక్షేమాన్ని నేరుగా ప్రజలకే అందించామని తెలిపారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ, 'రాయలసీమ రైజింగ్' వంటి కార్యక్రమాలతో యువతకు, వెనుకబడిన ప్రాంతాలకు భరోసా ఇస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తున్నాయని కొనియాడారు.

అరాచక పాలనకు, ప్రజాస్వామ్య పాలనకు తేడా ఇదే

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికలకు, నేటి కూటమి పాలనలో జరిగిన ఎన్నికలకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని పెమ్మసాని ఎద్దేవా చేశారు. 2019 తర్వాత జగన్ ప్రభుత్వం ప్రత్యర్థులపై గంజాయి, హత్యాయత్నం కేసులు పెడతామని బెదిరించి, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేస్తామని ఒత్తిడి చేసి నామినేషన్లు వేయనీయకుండా చేసిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ వార్డులు కలిపి 1,44,000 స్థానాలకు గాను 50,000 స్థానాలను, అంటే 35 శాతం సీట్లను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వంలో శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు అత్యంత శాంతియుతంగా ఎన్నికలు జరిగాయని, ప్రజలు స్వేచ్ఛగా ఓటేశారని అన్నారు. ఫలితాలు వెల్లడైన 92 మున్సిపాలిటీల్లో 88 చోట్ల, అంటే 90 శాతానికి పైగా స్థానాల్లో ప్రజలు కూటమికి పట్టం కట్టారని వెల్లడించారు.

మురసు తుపాను బలహీనం

-మొదటిపేజీ తరువాయి

శాఖ (ఐఎండీ), రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకల పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున నెల్లూరు--నర్సాపురం మధ్య ఒంగోలు సమీపంలో మురసు తుపాను తీరం దాటింది. అనంతరం భూభాగంపైకి ప్రవేశించిన తుపాను క్రమంగా బలహీనపడుతోంది. అయినప్పటికీ దాని ప్రభావంతో కోస్తాంధ్రలో వర్షాలు, ఈదురుగాలులు కొనసాగుతున్నాయి.

ఒంగోలు సమీపంలో తీరం దాటిన తుపాను

ఐఎండీ తాజా నివేదిక ప్రకారం నవంబర్ 3న తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 5.30 గంటల మధ్య మురసు తుపాను దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. నెల్లూరు నుంచి నర్సాపురం మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటిన సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు నమోదయ్యాయి. తుపాను తీరం దాటే సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో తీర ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

తుపాను తీవ్రత తగ్గుముఖం

తీరం దాటిన తర్వాత మురసు తుపాను ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలహీనపడింది. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయానికి బాపట్లకు పశ్చిమ వాయవ్య దిశలో 40 కిలోమీటర్లు, ఒంగోలుకు ఉత్తరంగా 60 కిలోమీటర్లు, విజయవాడకు నైరుతి దిశలో 80 కిలోమీటర్లు, మచిలీపట్నానికి పశ్చిమంగా 110 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ సమయంలో గాలుల వేగం గంటకు 80--90 కిలోమీటర్లకు తగ్గగా, అప్పుడప్పుడు 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. అర్ధరాత్రి నాటికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

పలు జిల్లాల్లో భారీ వర్షాల హెచ్చరిక

తుపాను బలహీనపడుతున్నప్పటికీ దాని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగనున్నాయి. మంగళవారం కోస్తాంధ్రలో అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పల్నాడు, తిరుపతి, నంద్యాల జిల్లాల్లో ఒకటి రెండు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



నవంబర్ 4న కూడా వర్షాలు

మురసు తుపాను బలహీనపడినప్పటికీ నవంబర్ 4న కూడా వర్షాల ప్రభావం కొనసాగే అవకాశం ఉంది. పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుపాను ప్రభావంతో ఇప్పటికే భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో అదనపు వర్షపాతం నమోదైతే వరద పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఆకస్మిక వరదలపై అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లే ప్రమాదం ఉందని విపత్తుల నిర్వహణ అధికారులు హెచ్చరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వరద నీరు ప్రవహించే రహదారులు, వంతెనలు, కల్వర్టులను దాటేందుకు ప్రయత్నించవద్దని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, నేలకూలిన చెట్లకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

తుపాను బలహీనపడినా హెచ్చరికలు కొనసాగింపు

మురసు తుపాను తీవ్రత తగ్గడం ఊరటనిచ్చే అంశమే అయినప్పటికీ వర్షాలు, వరదల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగాలు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. సహాయక బృందాలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధికారుల నుంచి తదుపరి హెచ్చరికలు వచ్చే వరకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విపత్తుల నిర్వహణ సంస్థ విజ్ఞప్తి చేస్తోంది.

రాష్ట్రంలో అతిపెద్ద ఈవీ ఛార్జింగ్ కేంద్రంగా బోల్ట్.ఎర్త్





విజయవాడ, మహానగర్

రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించే దిశగా బోల్ట్.ఎర్త్ సంస్థ విజయవాడలో 1.5 మెగావాట్ల సామర్థ్యంతో భారీ ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. భారతదేశంలో అతిపెద్ద ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్‌గా పేర్కొనబడుతున్న బోల్ట్.ఎర్త్, పి క్యూబ్ సొల్యూషన్స్ భాగస్వామ్యంతో జాతీయ రహదారి-16 సమీపంలోని విజయవాడ నున్న వద్ద ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. నగర ప్రజలతో పాటు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు కూడా ఉపయోగపడేలా ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కార్లు, ట్రక్కులు, బస్సులతో పాటు ద్విచక్ర, త్రిచక్ర ఎలక్ట్రిక్ వాహనాలకు ఛార్జింగ్ సదుపాయాలు కల్పించారు. మొత్తం ఛార్జింగ్ వ్యవస్థలో రెండు 240 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ ఛార్జర్లు, మూడు 180 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ ఛార్జర్లు, ఒక 60 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ ఛార్జర్ ఉన్నాయి. వీటితో పాటు త్రిచక్ర వాహనాల కోసం 6 కిలోవాట్ల ఫాస్ట్ ఛార్జర్, ద్విచక్ర వాహనాల కోసం రెండు 3 కిలోవాట్ల డీసీ ఫాస్ట్ ఛార్జర్లు, నాలుగు 3.3 కిలోవాట్ల ఏసీ ఛార్జింగ్ సాకెట్లను ఏర్పాటు చేశారు. దీంతో వివిధ రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు ఒకే కేంద్రంలో ఛార్జింగ్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా బోల్ట్.ఎర్త్ వ్యవస్థాపకుడు జ్యోతిరంజన్ హరిచందన్ మాట్లాడుతూ, అధిక సామర్థ్యం కలిగిన ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు సాంకేతికత, విద్యుత్ లభ్యత, అనువైన ప్రదేశాల ఎంపిక కీలకమని పేర్కొన్నారు. పి క్యూబ్ సొల్యూషన్స్‌తో భాగస్వామ్యం ద్వారా ఈ అంశాలన్నింటినీ సమన్వయం చేసి విజయవాడలో 1.5 మెగావాట్ల ఛార్జింగ్ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విశ్వసనీయమైన ఛార్జింగ్ మౌలిక వసతుల కల్పనకు ఇలాంటి భాగస్వామ్యాలు అవసరమని అభిప్రాయపడ్డారు. పి క్యూబ్ సొల్యూషన్స్‌కు చెందిన డి. ఫణి ప్రకాశ్ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాల నుంచి ఫోర్ వీలర్ కార్ల వరకు వివిధ విభాగాలకు బోల్ట్.ఎర్త్ సమగ్ర ఛార్జింగ్ పరిష్కారాలను అందిస్తోందని తెలిపారు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌తో పాటు విక్రయానంతర సేవలను కూడా ఒకే సంస్థ అందించడం తమ భాగస్వామ్యానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. జాతీయ రహదారి-16కు సమీపంలో ఈ కేంద్రం ఏర్పాటు కావడం వల్ల ఎలక్ట్రిక్ వాహనదారులకు మరింత సౌకర్యం కలుగుతుందని, ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణకు ఇది దోహదపడుతుందని ఆయన తెలిపారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉన్నాం


జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

బుడమేరు ప్రవాహం పూర్తిగా అదుపులోనే ఉంది.. పుకార్లు నమ్మొద్దు

కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల ప్రజల సురక్షిత తరలింపు

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ

అత్యవసర సహాయం కోసం 9154970454



విజయవాడ, మహానగర్

మురసు తుపాను ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వరద పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రజల రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గత రెండు రోజులుగా పరిస్థితిని 24 గంటలూ పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. బుడమేరు ప్రవాహం పూర్తిగా అదుపులోనే ఉందని, నీటి ప్రవాహం సాధారణ స్థాయిలో కొనసాగుతోందని స్పష్టం చేశారు. బుడమేరు విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న అసత్య, భయాందోళనలు కలిగించే వార్తలను నమ్మవద్దని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే జిల్లా యంత్రాంగం అధికారికంగా సమాచారం అందిస్తుందని తెలిపారు. విజయవాడ నగరంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. కొండ ప్రాంతాలు మినహా ఇతర ప్రాంతాల ప్రజలు ఇళ్లను ఖాళీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాన్పు తేదీలు సమీపించిన గర్భిణులు, వృద్ధుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి, ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సెక్టార్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. విస్సన్నపేట తదితర ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహంపై, క్లౌడ్‌బరస్ట్ ముప్పు ఉన్న మండలాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు తాగునీరు, పౌష్టికాహారం, నిరంతర విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నగరంలోని రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య బృందాలు నిరంతరం చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆందోళనకర పరిస్థితులు లేవని కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, కళాశాలలకు ముందుజాగ్రత్తగా సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అనధికారిక, ధృవీకరించని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయవద్దని కోరారు. జిల్లా యంత్రాంగం విడుదల చేసే అధికారిక సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. అత్యవసర సహాయం లేదా సమాచారం కోసం జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454ను సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అసైన్డ్, ఇనాం, చుక్కల భూముల ఫ్రీహోల్డ్ దరఖాస్తులపై కీలక జీవో

విజయవాడ

అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూములపై వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల విషయంలో ఏపీ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసింది. ఇలాంటి భూములకు సంబంధించిన ఫ్రీహోల్డ్ దరఖాస్తులు వెంట వెంటనే పరిష్కరించే విధంగా కాలపరిమితిని విధించింది. దీని ప్రకారం ఆర్డీవో పరిధిలో దరఖాస్తులకు 60 రోజుల్లో అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. నిర్దిష్ట కేటగిరీ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలి. అదేవిధంగా తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారానికి 60 రోజుల సమయం తీసుకొవచ్చని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 659 జారీ చేయడం జరిగింది.రాష్ట్రంలోని అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ ఈ భూముల ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ కోసం రైతులు చేసుకునే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా.. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన డెడ్‌లైన్లు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 659ను అధికారికంగా రిలీజ్ చేసింది.ఈ కొత్త జీవో ప్రకారం ఆర్డీవో పరిధిలోకి వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను ఎక్కువలో ఎక్కువగా రెండు నెలల్లోపు అంటే 60 రోజుల్లోపు కచ్చితంగా పరిష్కరించాల్సి ఉంటుంది. అదేవిధంగా కొన్ని నిర్దిష్ట కేటగిరీలకు చెందిన అప్లికేషన్లను కేవలం నెల రోజుల్లోనే క్లియర్ చేయాలని ప్రభుత్వం అధికారులకు కచ్చితమైన గడువును నిర్దేశించింది. ఇక తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులకు సైతం 60 రోజుల సమయాన్ని గరిష్ట పరిమితిగా నిర్ణయించింది.ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం రెవెన్యూ శాఖ పోర్టల్లో పలు సాంకేతిక మార్పులను సైతం చేసింది. రైతులు లేదా యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజే, ఆ అప్లికేషన్ నేరుగా సంబంధిత తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. దీనివల్ల ఫైళ్ల కదలికలో జరిగే జాప్యానికి పూర్తిగా చెక్ పడినట్టవుతుంది.అలాగే రిజిస్ట్రేషన్ల విషయంలోనూ ప్రభుత్వం రైతులకు లైన్ క్లియర్ చేసింది.

విజయవాడలో వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం

విజయవాడ, మహానగర్:





నగర మేయర్‌గా కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మిపై ఒక లక్షా 30 వేల 872 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొంది రాధాకృష్ణ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికలో విజయం సాధించిన అనంతరం తన సతీమణితో కలిసి వచ్చి ఎన్నికల అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. తన పుట్టినరోజు నాడే రాధాకృష్ణ విజయవాడ మేయర్‌గా ఎన్నిక కావడం విశేషం. ఈ సందర్భంగా వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు, సహకారంతో విజయవాడ నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. తనకు ఇంతటి భారీ మెజారిటీ అందించిన నగర ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లాలో నేడు విద్యాసంస్థలకు సెలవు

విజయవాడ, మహానగర్



మురసు తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 4వ తేదీ బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలు, అధికారులు ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అత్యవసరమైతే తప్ప పిల్లలను ఇళ్ల నుంచి బయటకు పంపవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు, కాలువలు, చెరువులు, నీటి ప్రవాహాలు ఉన్న ప్రాంతాల వైపు పిల్లలు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, ఆదేశాలను గమనిస్తూ అధికారులకు సహకరించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వరుస తుఫాన్లు... ఏం జరుగుతోంది

విజయవాడ

వారం రోజుల వ్యవధిలో ఏర్పడిన రెండు తుఫాన్లు ఏపీలో వర్షాభావాన్ని పూర్తిగా తగ్గించేశాయనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులపై ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొనే ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు తుఫాన్లు చాలా మేలు చేశాయని విశ్లేషిస్తున్నారు. తుఫాన్ కారణంగా చాలా నష్టం జరిగినప్పటికీ, భారీ వర్షాల కారణంగా వేసవి సవాళ్లను అధిగమించేలా అవకాశం లభించిందని అంటున్నారు. ప్రస్తుతం చేతికందిన పంట కొంతవరకు దెబ్బతిన్నప్పటికీ, రెండో పంటకు పుష్కలంగా నీరు లభించిందని చెబుతున్నారు. ప్రస్తుతానికి ఇటు రైతుకు అటు ప్రభుత్వానికి నష్టం జరిగినా, ఎల్ నినో ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా బయటపడటంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించినట్లేనని అంటున్నారు. ఎల్ నినో కారణంగా ఈ ఏడాది రాష్ట్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంది. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో రాష్ట్రంలో దాదాపు 450 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. పంట దిగుబడులు తగ్గిపోతాయనే ఆందోళన ఎక్కువ కావడంతో మార్కెట్లో అనేక రకాల సరకులకు డిమాండ్ పెరిగిపోయింది. దీంతో ఎన్నడూ లేనట్లు నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని చెబుతున్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబును రాజకీయంగా ఇరుకన పెట్టేందుకు ప్రత్యర్థులు ఈ వాతావరణ పరిస్థితులను కూడా వాడుకుంటున్నారు. రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నేతలతోపాటు తెలంగాణకు చెందిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు సైతం చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వర్షాలు కురవవు అనే సెంటిమెంటు ద్వారా రాజకీయం చేయాలని చూశారని అంటున్నారు. అయితే అనూహ్యంగా గత వారం రోజుల్లో రెండు తుఫాన్లు ఏర్పడటంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితుల నుంచి బయటపడిందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత నెల 28న కోనసీమ తీరాన్ని తాకిన అర్నబ్ తుఫాన్ వల్ల శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలే కురిశాయి. ఈ వర్షాల కారణంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాదాపు 20 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ వర్షాల వల్ల జరిగిన నష్టానికి సమానంగా మేలు కూడా జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదపు కోస్తా ప్రాంతంలో పుష్కలంగా నీరు చేరిందని, అన్ని చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయని చెబుతున్నారు. వాగులు, వంకలు, గెడ్డలు పొంగిపొర్లడంతో రానున్న వేసవికి తాగునీటి సమస్య తలెత్తే అవకాశం లేదని విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి ఎల్ నినో కారణంగా 2027 జూన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని అంటున్నారు. దీనివల్ల తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. పొరుగున ఉన్న తెలంగాణలో ఇప్పటికే ఈ సమస్య మొదలైందన్న వార్తలు వస్తున్నాయి. అయితే ఏపీకి మాత్రం రెండు తుఫాన్లు తాగునీటి ముప్పు లేకుండా చేశాయని, అదే సమయంలో రబీ పంటలకు సాగునీటి చింత లేకుండా పోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. అర్నాబ్ కారణంగా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు మంచి వర్షాలు కురిస్తే, ఇప్పుడు మురసు తుఫాన్ వల్ల ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం, పల్నాడు జిల్లాలతోపాటు రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక ఈ సీజన్ లో చుక్క నీరు కూడా చేరని పులిచింతల, నాగార్జున సాగర్ కు భారీగా వరద వచ్చే అవకాశం ఉందన్న అంచనాలు ఆ ప్రాజెక్టుల కింద ఉన్న రైతుల్లో ఆశలు రేపుతున్నాయని చెబుతున్నారు. మొత్తానికి ఈ పరిస్థితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరటనిస్తున్నట్లుగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రానికి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసిన చంద్రబాబు హయాంలో వర్షాభావ పరిస్థితులు ఎదురవడం అత్యంత సహజమే అయినప్పటికీ ఆయన రాజకీయ ప్రత్యర్థులు ప్రకృతి శాపంగా విమర్శలు చేయడం ద్వారా సీఎంను మానసికంగా ఇబ్బంది పెట్టేవారని అంటున్నారు. అయితే ఈ సారి ప్రకృతి ఇలాంటి విమర్శలకు అవకాశం ఇవ్వకుండా తాను చంద్రబాబు పక్షాన ఉన్నట్లు నిరూపిస్తోందని అంటున్నారు. గత ఆగస్టులో కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలకు కృష్ణా, గోదావరి నదులకు ఒకేసారి వరదలు వచ్చాయి. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు లిప్ట్ ద్వారా రాయలసీమకు నీటిని తరలించి ఆ ప్రాంతంలో పంటలను కాపాడగలిగారని అంటున్నారు. ఇదే సమయంలో పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసి కృష్ణా డెల్టాకు కరువు ఛాయలు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఇప్పుడు మిగిలిన ప్రాంతంలోనూ తుఫాను కారణంగా వర్షాలు కురిసి నీటి కొరత లేకుండా పోయిందని విశ్లేషిస్తున్నారు. ఇదంతా గమనిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిస్థితులు అనుకూలిస్తున్నట్లుగా భావించాల్సివస్తోందని అంటున్నారు.

టీటీడీకి కొత్త కమిటీ.. ముగ్గురు ఉన్నతాధికారులతో 'స్పెసిఫైడ్ అథారిటీ' ఏర్పాటు

తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి పదవీ కాలం ఇటీవల ముగియడంతో టీటీడీ రోజువారీ నిర్వహణ.. పరిపాలనా పనులు సాఫీగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ జీవో నెంబర్ 658 ద్వారా అధికారిక నియామకాలను ప్రభుత్వం ఖరారు చేయడం జరిగింది. టీటీడీ ధర్మకర్తల మండలికి ఉండే పూర్తి అధికారులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీలో ఉన్నతాధికారులు ఉంటారు. ఈ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా టీటీడీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు.తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి రెండేళ్ల పదవీ కాలం ఇటీవల ముగిసింది. తిరుమల చరిత్రలో ఇలాంటి స్పెసిఫైడ్ అథారిటీలు ఏర్పాటు కావడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలోనూ పాలకమండలి పదవీకాలం ముగిసి కొత్త బోర్డు ఏర్పాటులో న్యాయపరమైన, సాంకేతిక అడ్డంకులు ఎదురైన సందర్భాల్లో ప్రభుత్వాలు అధికారులతో కూడిన ప్రత్యేక వ్యవస్థలను నడిపిన దాఖలాలు ఉన్నాయి. అయితే ఈసారి ఎన్నికల నియమావళి అడ్డంకిగా మారడం, రాజకీయ నియామకాలకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించని కారణంగా .. ప్రభుత్వానికి స్పెసిఫైడ్ అథారిటీని తెరపైకి తేవడం అనివార్యమైంది.

అల్పపీడనం నుంచి సూపర్ తుపాను వరకు?

మురసు.. అర్నబ్.. హుద్ హుద్.. తిత్లీ.. మొంథా.. ఒగ్ని.. ఈ పేర్లు వినే ఉంటారు కదా..!గత కొన్నేళ్లలో వచ్చిన తుపానుల పేర్లు ఇవి.వీటన్నింటికీ ఒక పోలిక ఉంది. అదేంటని అనుకుంటున్నారా?! ఇవన్నీ అక్టోబరు, నవంబరు నెలలో సంభవించాయి. ఏటా బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపానులలో ఎక్కువగా ఈ రెండు నెలల్లోనే ఉంటున్నాయని భారత వాతావరణ శాఖ చెబుతోంది.ఇంతకీ అక్టోబరు, నవంబరు నెలల్లోనే ఎక్కువగా తుపానులు ఏర్పడ్డానికి కారణమేమిటనే విషయంపై భారత వాతావరణ శాఖ, ఇన్ కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఒషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్) ఈ తుపానులు ఏర్పడటంలో సముద్ర ఉష్ణోగ్రతలు కీలక పాత్ర పోషిస్తాయని అని ఇన్ కాయిస్ శాస్త్రవేత్త బి.శివయ్య చెప్పారు.భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. 1891 నుంచి 2025 మధ్య బంగాళాఖాతంలో వాయుగుండాలు, తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 1261 ఏర్పడ్డాయి.వీటిల్లో ఎక్కువగా రెండు నెలల కాలంలో.. అంటే అక్టోబరు, నవంబరులోనే వచ్చాయి.అంతేకాదు, ఈ రెండు నెలల్లో వచ్చే తుపానుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంది. బంగాళాఖాతంలో 1891 నుంచి 2025 వరకు తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 541 వచ్చినట్లుగా భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఇందులో అక్టోబరులో 96, నవంబరులో 126లో ఏర్పడ్డాయి.అలాగే 1891 నుంచి 2025 మధ్య తీవ్ర తుపానులు 247 ఏర్పడగా.. అక్టోబరులో 44, నవంబరులో 76 వచ్చాయి. తుపానుల విషయంలో సముద్ర ఉష్ణోగ్రతలలు, గాలుల గమనం తీరు కీలకంగా మారతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.నైరుతి రుతుపవనాల తిరోగమనం(పోస్ట్ మాన్ సూన్) తర్వాత తుపానులు ఎక్కువగా తూర్పు తీరం వైపున ఏర్పడుతుంటాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న చెప్పారు.”పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే అల్పపీడనాలు అండమాన్ కింద నుంచి బంగాళాఖాతంలోకి వచ్చి చేరుతుంటాయి. రుతుపవనాల ముందు మయన్మార్ తీరంలో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుంటాయి. దానివల్ల అటువైపు తుపానులు వెళుతుంటాయి.కానీ, రుతుపవనాల తిరోగమనం తర్వాత బంగాళాఖాతంలో తూర్పు తీరంవైపు సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. దానివల్ల తూర్పు తీరంవైపు తుపానుల గమనం ఉంటుంది. ఇందుకు గాలుల గమనం కూడా సహకరిస్తుంది ” అని చెప్పారు నాగరత్న.ఈ సమయంలో బంగాళాఖాతంలో సముద్రపు ఉష్ణోగ్రతలు సగటున 26.5 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటాయని వివరించారు.”సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు రెండు సీజన్లలో ఎక్కువగా రికార్డవుతుంటాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఒకసారి? అక్టోబరు, నవంబరు సీజన్లలో మరోసారి ఎక్కువగా ఉంటాయి” అని బి.శివయ్య చెప్పారు.రుతుపవనాల తర్వాత శీతాకాలం వచ్చి సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు తగ్గడానికి కొంత ఆలస్యం అవుతుందని వివరించారు. ఈ పరిస్థితులతో అల్పపీడన ద్రోణి ఏర్పడటానికి పరిస్థితులు సహకరిస్తాయి” అని చెప్పారు.బంగాళాఖాతంలో ఏర్పడే తుపానులు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా తీరం దాటడాన్ని గమనిస్తుంటాం.ఆంధ్రప్రదేశ్‌కు 1053.07 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరం ఉండగా, ఒడిశాకు 574.71 కిలోమీటర్ల పొడవైన తీరం ఉంది.తీరం పొడవు, తీరంలోని పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ వద్ద తుపానులు ఎక్కువగా తీరం దాటుతుంటాయని చెప్పారు నాగరత్న.”మచిలీపట్నం, నరసాపురం, కాకినాడ వద్ద తీరంలో మలుపులు ఉంటాయి.గోదావరి, కృష్ణా నదులు కలిసే ప్రాంతాలున్నాయి.తీరంలో ఉండే మలుపులు, సముద్రంలో నదులు కలిసే ప్రాంతాలు కూడా తుపానులను ఆకర్షించడానికి కారణమవుతాయి” అని వివరించారు.2026 అక్టోబరు.. అర్నబ్ అతి తీవ్ర తుపాను.. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపురం సమీపంలో తీరం దాటింది. ఏపీపై పెను ప్రభావం చూపించింది.2026 నవంబరు.. మురసు తీవ్ర తుపాను.. ఇది ఆంధ్రప్రదేశ్ తీరంలోని నెల్లూరు సమీపంలో తీరం దాటింది.2014 అక్టోబరు.. హుద్ హుద్ తీవ్ర తుపాను.. ఏపీలో విశాఖపట్నంపై విరుచుకుపడింది.ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రికార్డుల ప్రకారం ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పెను విధ్వంసం సృష్టించింది.ఇవేకాకుండా, ఏపీ చరిత్రలో అత్యంత తీవ్రమైన తుపానుగా కోస్తా తీర ప్రాంతవాసులు చెప్పుకొనే దివిసీమ తుపాను లేదా దివిసీమ ఉప్పెన కూడా 1977 నవంబరులోనే వచ్చింది.ఈ తుపాను కారణంగా 24 లక్షల మంది ప్రభావితం అయ్యారు. పదివేల మందికిపైగా చనిపోయారని అంచనా.1996 కాకినాడలో వచ్చిన తుపాను కూడా నవంబరు నెలలో సంభవించింది.2012లో కోస్తా జిల్లాలను కుదిపివేసిన నీలం తుపాను కూడా నవంబరులోనే సంభవించింది.సముద్రంలో ఏర్పడే అల్పపీడన ద్రోణి బలపడితే వాయుగుండగా మారుతుంది. వాయుగుండం బలపడి తీవ్ర వాయుగుండం.. ఆ తర్వాత తుపానుగా మారుతుంది.తుపానులలో గాలుల వేగాన్ని బట్టి విభజన ఉంటుందని భారత వాతావరణ శాఖ చెబుతుంది.ప్రభావాన్ని బట్టి తుపాను లేదా తీవ్ర తుపాను లేదా అతి తీవ్ర తుపానుగా వాతావరణ శాఖ వర్గీకరిస్తుంది. గాలుల వేగాన్ని బట్టి విభజన ఉంటుంది.గంటకు 31 కిలోమీటర్ల కంటే తక్కువగా గాలుల వేగం ఉంటే అల్పపీడన ద్రోణిగా పరిగణిస్తారు.గంటకు 31-49 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే వాయుగుండం, 50-61 కిలోమీటర్ల వేగం ఉంటే తీవ్ర వాయుగుండంగా పిలుస్తారు.గంటకు 62-88 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే తుపాను, 89-117 కిలోమీటర్ల వేగంతో గాలులు ఉంటే తీవ్ర తుపాను, 118-167 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే అతి తీవ్ర తుపానుగా వాతావరణ శాఖ చెబుతుంది.అదే 168-221 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తే అత్యంత తీవ్రమైన తుపాను, 222 కిలోమీటర్లకు పైబడి గాలులు వస్తే సూపర్ తుపానుగా చెబుతారు.

ఇతర దేశాల్లో ‘సర్’ ఇలా..!



పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తున్న మిగతా దేశాల్లో ఓటర్ల జాబితాలు ఎలా తయారవుతాయి? భారత్ తరహా ‘సర్’ పద్ధతిని ఆయా దేశాల్లో అమలు చేస్తారా? దేశంలో ఓటర్ల జాబితా నవీకరణ వివాదాస్పదమైన నేపథ్యంలో ఇవి పరిశీలించాల్సిన అంశాలయ్యాయి. సాధారణంగా ఓటర్ల జాబితాల సవరణలో పేర్ల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులు, వివరాలు సరిదిద్దడం వంటివి జరుగుతూనే ఉంటాయి. అయితే భారత్‌లో ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో ఓటర్ల అర్హతలను విస్తృతంగా పరిశీలించి జాబితాలను సమగ్రంగా సవరించడంపై దృష్టి పెట్టారు.

అమెరికా విధానం ఈ విషయంలో ప్రత్యేకంగా గమనించదగినది. అక్కడ దేశవ్యాప్తంగా ఒకే కేంద్ర సంస్థ రూపొందించే ఏకీకృత ఓటర్ల జాబితా లేదు. ఓటర్ల నమోదు, జాబితాల నిర్వహణ ప్రధానంగా రాష్ట్రాలు, స్థానిక ఎన్నికల అధికారుల పరిధిలో ఉంటాయి. నార్త్ డకోటా మినహా మిగతా రాష్ట్రాల్లో ఓటు వేయడానికి సాధారణంగా ముందస్తు నమోదు అవసరం. రాష్ట్రాన్ని బట్టి ఆన్‌లైన్, తపాలా లేదా ప్రభుత్వ కార్యాలయాల ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. మరణాలు, చిరునామాల మార్పులు, అర్హతకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ రికార్డులతో సరిపోల్చి జాబితాలను నవీకరిస్తారు. ఒక వ్యక్తి ఓటు వేయలేదనే కారణంతోనే అతని పేరును తొలగించడానికి సమాఖ్య చట్టం అనుమతించదు. జాబితాల శుద్ధి ప్రక్రియలకూ చట్టపరమైన పరిమితులు ఉంటాయి. అమెరికాలోనూ ఓటర్ల వివరాల పరిశీలన జరుగుతుంది. కానీ అది భారత్‌లోని ఎస్ఐఆర్ తరహాలో కేంద్రీకృత ప్రక్రియ కాదు. రాష్ట్రాలవారీగా నిరంతర నవీకరణ ఉంటుంది. జర్మనీలో నివాస నమోదు వ్యవస్థ ఎన్నికల ప్రక్రియకు కీలకం. పౌరులు నివాస చిరునామాను సంబంధిత స్థానిక సంస్థల్లో నమోదు చేసుకున్నప్పుడు, ఆ సమాచారం ఆధారంగా అర్హులైన ఓటర్ల జాబితాలను రూపొందిస్తారు. అందువల్ల ప్రతి ఎన్నికకు ముందు ప్రతి ఒక్కరూ మళ్లీ మొదటి నుంచి నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. నివాస మార్పులు, ఇతర పరిపాలనా వివరాలు నవీకరించడం ద్వారా జాబితాల కచ్చితత్వాన్ని కాపాడే ప్రయత్నం జరుగుతుంది. అయితే అర్హతలు, ఎన్నికల రకాన్ని బట్టి నిబంధనలు మారవచ్చు.

ఆస్ట్రేలియాలో ఎన్నికల సంఘం ప్రభుత్వ విభాగాల నుంచి లభించే సమాచారాన్ని ఉపయోగించి ఓటర్ల వివరాలను నవీకరిస్తుంది. అర్హులైన పౌరులు జాబితాలో నమోదు అయ్యేలా చూడటానికి ప్రత్యక్ష నమోదు, సమాచార సరిపోలిక వంటి విధానాలకు ప్రాధాన్యం ఇస్తారు. కెనడాలోనూ జాతీయ ఓటర్ల రిజిస్టర్ నిర్వహిస్తారు. పన్నుల శాఖ సహా వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి లభించే సమాచారంతో వివరాలను సరిచూస్తారు. చిరునామా మారినవారి వివరాలను నవీకరించడం ద్వారా ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రయత్నిస్తారు. ఈ దేశాల్లో జాబితాల కచ్చితత్వంతో పాటు, అర్హులైనవారు నమోదు ప్రక్రియలో వెనుకబడిపోకుండా చూడటానికీ ప్రాధాన్యం ఉంటుంది.

బ్రిటన్‌లో వ్యక్తిగత ఓటరు నమోదు విధానం అమల్లో ఉంది. స్థానిక ఎన్నికల నమోదు అధికారులు జాబితాలను నిర్వహిస్తూ, వార్షిక తనిఖీలు, ప్రభుత్వ రికార్డుల ఆధారంగా వివరాల సవరణ చేపడతారు. ఫ్రాన్స్, స్వీడన్ వంటి దేశాల్లోనూ జనాభా, నివాస నమోదు వ్యవస్థలు ఎన్నికల నిర్వహణకు ఉపయోగపడతాయి. పౌరసత్వం, నివాస అర్హత, ఎన్నికల స్వభావం, స్థానిక చట్టాల ఆధారంగా నమోదు ప్రక్రియలు మారుతుంటాయి. ఈ పద్ధతులు భారత్‌కు ముఖ్యమైన పాఠాలను అందిస్తున్నాయి. ఓటర్ల జాబితాల సమగ్ర సవరణను ఒక ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టాల్సిన పరిస్థితులు రావచ్చు. కానీ దానికి ముందు నిరంతర నవీకరణ వ్యవస్థను బలోపేతం చేయడం మరింత ప్రయోజనకరం. జనన, మరణాల నమోదు, చిరునామా మార్పులు, ప్రభుత్వ రికార్డుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచాలి. ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను ఉపయోగించినా, వాటి ఆధారంగా మాత్రమే ఓటు హక్కును నిర్ణయించకుండా ఎన్నికల చట్టాలు నిర్దేశించిన అర్హతలనే ప్రాతిపదికగా తీసుకోవాలి. పేరు తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి సమాచారం అందించడం, అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇవ్వడం, నిర్ణయానికి కారణాలను వెల్లడించడం అవసరం. రాజకీయ పార్టీలకు, పౌర సమాజానికి పారదర్శక పరిశీలనలో భాగస్వామ్యం కల్పించాలి. ఓటర్ల జాబితాల సవరణ అనేది పౌరుల ప్రజాస్వామిక హక్కుతో ముడిపడిన బాధ్యత. జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండకూడదు, అంతకంటే ముఖ్యంగా అర్హులైన ఒక్క పౌరుడి పేరు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు. అంతర్జాతీయ విధానాల్లో ఏ పద్ధతిని అనుసరించినా పారదర్శకత, ప్రజలకు అందుబాటు, అప్పీలు చేసుకునే అవకాశం, అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు రక్షణ అనేవే ప్రాధాన్య సూత్రాలుగా ఉండాలి. ఓటర్ల జాబితా శుద్ధి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి తప్ప, ఓటు హక్కుపై అనుమానాలు పెంచకూడదు.

టాటా గ్రూప్ భవిష్యత్తు ఏమిటి?



దిగ్గజ వ్యాపార సంస్థల అంతర్గత వ్యవహారాలు కేవలం వాటికే పరిమితం కాకుండా సామాన్యుడి ఆశయాలు, ముఖ్యంగా యువ విద్యావంతుల భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపుతాయి. టాటా గ్రూప్‌లో యాజమాన్య ఆధిపత్య పోరు ముమ్మందు-- తెలుగునాట ఒక మారుమూల గ్రామానికి చెందిన ఒక యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆశయ స్వప్నమైన ఉద్యోగం మొదలు, భోగాపురం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసుల వరకూ ప్రభావితం చేయగలిగే వ్యవహారం.

అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన కార్పొరేట్ సంస్థలలో టాటా గ్రూప్ ప్రథమ గణ్యమైనది. 100కు పైగా దేశాలలో వివిధ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఈ సంస్థ సర్వత్రా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును దక్కించుకున్నది. టాటాలో పనిచేసిన అనుభవంతో అంతర్జాతీయ దిగ్గజ సంస్థల్లో కొలువులు పొంది రాణిస్తున్న భారతీయులు పలువురు ఉన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన వి.బి.కె మూర్తి అనే ఇంజినీర్ అటువంటివారిలో ఒకరు. జంషెడ్‌పూర్‌లోని టాటా ఉక్కు కర్మాగారంలో నాలుగు దశాబ్దాల క్రితం పనిచేసిన అనుభవంతో నేడు ఆయన ఖతర్‌లోని ఒక అగ్రశ్రేణి అమెరికన్ ఇంజినీరింగ్ సంస్థలో ఉన్నత స్థానంలో ఉన్నారు. మధ్యప్రాచ్య దేశాలలో ఆ సంస్థకు సంబంధించిన కార్యకలాపాలను ఆయన పర్యవేక్షిస్తున్నారు. టాటా గ్రూప్‌లో భాగమైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రతిభావంతులైన వేలాది తెలుగు యువతీయువకులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. క్యాంపస్ ఇంటర్వ్యూలలో టీసీఎస్ పిలుపు కొరకు ఎదురుచూసే యువతకు తెలుగునాట కొదవలేదు. అమెరికా, అరబ్, ఐరోపా దేశాలలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పెద్ద సంఖ్యలో రాణిస్తున్నారంటే అందుకు టీసీఎస్ చేస్తున్న దోహదం విస్మరించలేనిది. గత ఆర్థిక సంవత్సరంలో టాటా గ్రూప్ ఆర్జించిన 1 లక్షా 70 వేల కోట్ల రూపాయల నికరలాభంలో సింహభాగం టీసీఎస్ ద్వారా సమకూరింది. టీసీఎస్ విజయాలకు తెలుగు యువ ఇంజినీర్లు కూడా ప్రధాన కారకులు అనేది ఒక వాస్తవం.

అవిభక్త భారతదేశంలో టాటా గ్రూప్ నెలకొల్పిన ఎయిర్ ఇండియానే ఇప్పటికీ భారత్‌లో సగటు భారతీయుడి విమానయాన సంస్థ. స్వాతంత్ర్యానం తరం జాతీయీకరణ అయిన ఈ సంస్థ నిరంతరం నష్టాలతో నడుస్తుండేది. ప్రైవేటీకరణ అనంతరం 2022లో టాటా గ్రూపే మళ్లీ దీన్ని స్వాధీనం చేసుకున్నది. కారణమేమైనప్పటికీ విదేశీ విమాన యాన సంస్థలు, ముఖ్యంగా గల్ఫ్ దేశాల సంస్థలతో పోటీప డలేక ఎయిర్ ఇండియా నష్టాలను చవిచూస్తోంది! భారత పౌరవిమానయాన విపణిలో ఎమిరేట్స్, ఖతర్ ఎయిర్‌వేస్ లాభాలను ఆర్జిస్తుండగా ఎయిర్ ఇండియాకు మాత్రం నష్టాలు వస్తున్నాయి. టాటా గ్రూప్ స్వాధీనం చేసుకున్న అనంతరం కూడా ఎయిర్ ఇండియా గత ఆర్థిక సంవత్సరంలో రూ.22,238 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఫలితంగా ఎయిర్ ఇండియా తన మనుగడను నిలబెట్టుకునేందుకు ఏటా తన మాతృసంస్థ టాటా గ్రూప్ నుంచి నిధులు కోరడం పరిపాటి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఎయిర్ ఇండియా వద్ద విమానాలు లేకపోవడమే అది చవిచూస్తున్న నష్టాలకు ఒక ప్రధాన కారణం. కనుకనే విజయవాడ, విశాఖపట్టణం ఇత్యాది నగరాల నుంచి మరిన్ని అంతర్జాతీయ, జాతీయ విమాన సర్వీసులను నడపాలనే ప్రజల ఆకాంక్షను ఎయిర్ ఇండియా నెరవేర్చలేకపోతున్నది. విమానాల కొరతను అధిగమించేందుకై భారీగా 470 విమానాలను కొనుగోలు చేసేందుకు ఎయిర్ ఇండియా పూనుకున్నది. ఈ కొనుగోళ్లకు టాటా గ్రూప్ నిధులు సమకూర్చవల్సి ఉంది. ఈ నేపథ్యంలో టాటా గ్రూప్‌లో 66 శాతం వాటా ఉన్న అసలు యజమానులైన టాటా ట్రస్టుల అభీష్టానికి విరుద్ధంగా యాజమాన్య మార్పిడి దిశగా జరుగుతున్న ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యాపార సంస్థే అయినప్పటికీ మేరా భారత్ మహాన్‌లో టాటా గ్రూప్ తన వంతు పాత్రను ప్రశస్తంగా పోషించిందన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.

స్వచ్ఛంద ఉద్యమం చేపట్టనున్న ధనుష్..

చెన్నై : కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గురించి ఇప్పుడు ఓ ఆసక్తికర విషయం ఫిల్మ్ వర్గాలతోపాటు సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తుంది. తన అభిమాన సంఘాన్ని ఇకపై స్వచ్ఛంద సంస్థగా మార్చనున్నట్లు ప్రచారం నడుస్తుంది. త్వరలోనే రాజకీయంలోకి అడుగుపెట్టనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భవిష్యత్తులో తలెత్తే ఏవైనా న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి దాదాపు 3వేల మంది న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు రాజకీయాల గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తుంది. ఇటీవలే సొంతంగా పార్టీ ప్రారంభించి అఖండమైన మేజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు విజయ్ దళపతి. ఇప్పుడు ఆయన దారిలో మరో హీరో ధనుష్ సైతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హీరో త్వరలోనే రాజకీయ ప్రవేశం చేయనున్నారనే ప్రచారం తమిళనాడు సినీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. ఇప్పటివరకు ఈ విషయం పై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ నెట్టింట మాత్రం రోజుకో వార్త హల్చల్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా మరో న్యూస్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న టాక్ ప్రకారం ధనుష్ అభిమాన సంఘాన్ని స్వచ్ఛంద సంస్థగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది న్యాయసలహాదారులను నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆన స్వచ్ఛంద సంస్థ 234 నియోజకవర్గాల కోసం ఏసీ సౌకర్యాలతో కూడిన ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతుందని ప్రచారం జరుగుతుంది.అభిమాన సంఘం ఒక స్వచ్ఛంద సంస్థగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో, రాజకీయ మార్గంలో భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు సమాచారం. మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ వీరిని నియమిస్తే, ప్రతి నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో న్యాయ సలహాదారులు అందుబాటులో ఉంటారని అంటున్నారు. భవిష్యత్తులో ధనుష్ స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులపై ఉన్న కేసులను పరిష్కరించడంలో, నిరసనల సమయంలో తలెత్తే చట్టపరమైన సమస్యలలో, స్థానిక సమస్యలలో వారు సహాయపడవచ్చని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇటీవల, ధనుష్ స్వచ్ఛంద సంస్థ వరుసగా అనేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా, అక్టోబర్ 15, 2026న, ఫ్యాన్ క్లబ్‌ను స్వచ్ఛంద సంస్థగా మార్చి, ఒక జెండా , లోగోను ఆవిష్కరించారు.దీని తర్వాత, అక్టోబర్ 18, 2026న జరిగిన మహిళా బృంద నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న 3,000 మందికి పైగా మహిళా నిర్వాహకులకు ఒక్కొక్కరికి 20 గ్రాముల వెండి దీపాన్ని బహూకరించారు.

చిన్న పట్టణాలే రేపటి ఆర్థిక శక్తులు

పుణె: దేశంలోని వందలాది చిన్న పట్టణాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పట్టణాలు కేవలం నివాస ప్రాంతాలే కాదని, దేశ ఆర్థిక కార్యకలాపాలకు కీలక కేంద్రాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థలు, ప్రైవేటు రంగం సమన్వయంతో పట్టణాభివృద్ధిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌ను ఏర్పాటు చేసిందని వెల్లడించారు. మంగళవారం మహారాష్ట్రలోని పుణెలో రూ.21,800 కోట్లతో చేపట్టిన మెట్రో ప్రాజెక్టును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పాల్గొన్నారు.



చిన్న నగరాలపై ప్రత్యేక దృష్టి

దేశాభివృద్ధిలో చిన్న పట్టణాల పాత్రను మరింత పెంచాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. పట్టణాలను ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి, పెట్టుబడులకు కేంద్రాలుగా మార్చాలన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా కేంద్రం రూ.లక్ష కోట్ల నిధులను అందిస్తోందని, రానున్న రోజుల్లో పట్టణాలకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యమని వివరించారు. స్థానిక సంస్థలు, ప్రైవేటు రంగ భాగస్వాములు మిషన్ మోడ్‌లో పనిచేయాలని పిలుపునిచ్చారు.

పుణెకు మెరుగైన మెట్రో కనెక్టివిటీ

పుణె నగరంలో మెట్రో విస్తరణతో పాత, కొత్త ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం కానుందని మోదీ తెలిపారు. హింజేవాడి ఐటీ హబ్ నుంచి శివాజీనగర్ వరకు మెట్రో సేవలు అందుబాటులోకి రావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుం దన్నారు. నగరంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఐటీ, ఆటోమొబైల్ రంగాలకు కేంద్రంగా పుణె

పుణె నగరం ఐటీ, ఆటోమొబైల్, ఫార్మాస్యూటికల్స్, స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, ఉత్పాదక రంగాల్లో కీలక కేంద్రంగా ఎదుగు తోందని ప్రధాని చెప్పారు. యువత ఆకాంక్షలకు పుణె వేదికగా నిలుస్తోందన్నారు. మెట్రో కనెక్టివిటీ పెరగడం నగర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

248 కిలోమీటర్ల నుంచి 1,200 కిలోమీటర్లకు..

గత పదేళ్లలో దేశంలో మెట్రో రైలు వ్యవస్థ గణనీయంగా విస్తరించిందని మోదీ వివరించారు. 2014లో దేశవ్యాప్తంగా 248 కిలోమీటర్ల మేర ఉన్న మెట్రో నెట్‌వర్క్ ప్రస్తుతం దాదాపు 1,200 కిలోమీటర్లకు చేరిందన్నారు. గతంలో ఐదు నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు ప్రస్తుతం 26 నగరాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రోజూ కోటి మందికి పైగా ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి

పుణె మెట్రో ప్రాజెక్టులో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానాన్ని అనుసరించామని ప్రధాని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ విధానం విజయవంతమైన నమూనాగా నిలుస్తుందని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఆయుధాల తయారీలో భారత్ దూకుడు


జైసల్మేర్: రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. 2029 నాటికి దేశీయ రక్షణ ఉత్పత్తుల విలువను రూ.3 లక్షల కోట్లకు, రక్షణ ఎగుమతులను రూ.50 వేల కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మారుతున్న అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు, ఆధునిక యుద్ధ సవాళ్లను ఎదుర్కొనేందుకు సైనిక సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన రక్షణ శాఖ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

పదేళ్లలో భారీగా పెరిగిన ఉత్పత్తులు

దేశీయ రక్షణ పరిశ్రమ గణనీయమైన పురోగతి సాధించిందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. 2014-15లో దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.46,429 కోట్లుగా ఉండగా.. 2025-26 నాటికి రికార్డు స్థాయిలో రూ.1.78 లక్షల కోట్లకు చేరిం దన్నారు. రక్షణ ఎగుమతులు కూడా 2014లో రూ.2 వేల కోట్ల కంటే తక్కువగా ఉండగా.. ప్రస్తుతం సుమారు రూ.40 వేల కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేసి అంతర్జాతీయ రక్షణ మార్కెట్‌లో భారత్‌ను కీలక శక్తిగా నిలపాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్

ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా సైన్యాన్ని సిద్ధం చేసేందుకు కేంద్రం రక్షణ బడ్జెట్‌ను గణనీయంగా పెంచిందని మంత్రి తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రక్షణ రంగానికి రూ.7.85 లక్షల కోట్లను కేటాయించగా, ఇందులో రూ.2.19 లక్షల కోట్లు మూలధన వ్యయానికి కేటాయిం చినట్లు వివరించారు. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, సైనిక పరికరాల కొనుగోలు, పరిశోధనలకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.



కొత్త మిలిటరీ విభాగాలతో బలోపేతం

భారత సైన్యాన్ని ఆధునీకరించే క్రమంలో అసాని, భైరవ్, శక్తిబాన్ వంటి కొత్త సైనిక విభాగాల ప్రాధాన్యాన్ని రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా సైనిక వ్యవస్థల్లో మార్పులు తీసుకురావడం అవసరమన్నారు.

అసాని: డ్రోన్ల ద్వారా నిఘా, లక్ష్యాలను గుర్తించడం, దాడులకు సంబంధించిన సామర్థ్యాలను పెంచే విభాగాలు.

భైరవ్: వేగవంతమైన, ప్రత్యేక సైనిక కార్యకలాపా ల కోసం ఏర్పాటు చేసిన లైట్ కమాండో దళాలు.

శక్తిబాన్: ఆధునిక యుద్ధ అవసరాల కు అనుగుణంగా ఫిరంగి దళాల సామర్థ్యాలను బలోపేతం చేసే వ్యవస్థ.

స్వదేశీ సాంకేతికతే కీలకం

దేశ భద్రత విషయంలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి ఎంతో ముఖ్యమని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. ఆయుధాలు, యుద్ధ పరికరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితిని తగ్గించి దేశీయంగానే తయారీ సామర్థ్యాలను పెంచుకోవా లన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైనికులకు నాణ్యమైన శిక్షణ, మానవ వనరుల అభివృద్ధి, మూడు సాయుధ దళాల మధ్య సమన్వయం కూడా కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే బహుముఖ భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా దశలవారీగా సైనిక ఆధునికీకరణ చేపడుతున్నట్లు వెల్లడించారు.

బయటి శక్తుల ప్రభావానికి లొంగని భారత్-రష్యా స్నేహం

న్యూఢిల్లీ: భారత్-రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలను బయటి శక్తులు ప్రభావితం చేయలేవని రష్యా స్పష్టం చేసింది. అంతర్జాతీయ రాజకీయాల్లో ఎన్ని మార్పులు చోటుచేసుకున్నా ఇరు దేశాల మధ్య బంధం కాలపరీక్షకు తట్టుకుని నిలబడిందని పేర్కొంది. ఈ సంబంధాలు కేవలం ప్రభుత్వాల మధ్య దౌత్య ఒప్పందాలకే పరిమితం కాలేదని, ప్రజల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక అనుబంధాల్లో బలంగా వేళ్లూనుకున్నాయని అభిప్రాయపడిం ది. ఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో నిర్వహించిన రష్యన్ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న రష్యా రాయబార కార్యాలయ ప్రతినిధి పెట్రో సిజోవ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

గాంధీ-టాల్‌స్టాయ్ లేఖలతో చారిత్రక అనుబంధం

భారత్-రష్యా మధ్య ఉన్న సుదీర్ఘ అనుబంధానికి మహాత్మా గాంధీ, ప్రముఖ రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్ మధ్య జరిగిన లేఖల మార్పిడిని సిజోవ్ ఉదాహరణగా ప్రస్తావిం చారు. గాంధీజీ టాల్‌స్టాయ్‌ను తన గురువుగా భావించే వారని, ఇద్దరూ ప్రత్యక్షంగా కలుసుకోకపోయినా లేఖల ద్వారా ఆలోచనలను పంచుకున్నారని గుర్తుచేశారు. ఇది రెండు దేశాల ప్రజల మధ్య ఉన్న అనుబంధానికి నిదర్శనమన్నారు. రష్యాలో భారతీయ సినిమాలకు, భారత్‌లో రష్యన్ బ్యాలెట్ నృత్యాలకు ఉన్న ఆదరణ సాంస్కృతిక సంబంధాల బలాన్ని తెలియజేస్తోందన్నారు. భారత్-రష్యా దౌత్య సంబంధాలకు 80 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సంగీత, కళా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.



యువతకు రష్యా సంస్కృతి పరిచయం

ప్రభుత్వాల మధ్య సంబంధాలతో పాటు ప్రజల మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని పెంపొందించడం ముఖ్యమని భారత్‌లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ సతీమణి డయానా అలిపోవా పేర్కొన్నారు. ప్రత్యక్ష కళా ప్రదర్శనల ద్వారా భారతీయ యువతకు రష్యా సంస్కృతిని పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఢిల్లీలోని పాఠశాలలతో కలిసి పనిచేస్తున్నామని, సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడులు

మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి పలు ప్రాంతాల్లోని కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని రష్యా భారీ స్థాయిలో డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ వెల్లడించారు. విద్యుత్ కేంద్రాలు, సబ్‌స్టేషన్లపై దాడుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఖార్కివ్‌లోని ఆస్పత్రిపై కూడా దాడి జరిగినట్లు ఆరోపించారు.

అమెరికా మరింత సాయం చేయాలి

ఉక్రెయిన్ గగనతల రక్షణను బలోపేతం చేసేందుకు అమెరికా మరింత సహకారం అందించాలని జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు. రష్యా నుంచి క్షిపణులు, డ్రోన్ల ముప్పు కొనసాగుతున్న నేపథ్యంలో వైమానిక రక్షణ వ్యవస్థలకు నిరంతర మద్దతు అవసరమని పేర్కొన్నారు. విశ్వసనీయమైన ప్రక్రియ ద్వారా శాంతి స్థాపనకు కృషి చేయాలని అమెరికాకు పిలుపునిచ్చారు. రష్యా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. ఒకవైపు భారత్-రష్యా మధ్య చారిత్రక స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం అంతర్జాతీయ రాజకీయాల్లో ఉద్రిక్తతలను కొనసాగిస్తోంది.

ట్రంప్‌కు అగ్నిపరీక్ష..

అమెరికా రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియ మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) మొదలైంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, కనెక్టికట్ సహా పలు తూర్పు తీర రాష్ట్రాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు పోలింగ్ మొదలవగా, ఓటు వేసేందుకు ప్రజలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.

ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు, సెనెట్‌లోని 100 స్థానాలకు గాను 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటికే 5.9 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ లేదా మెయిల్-ఇన్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది.


అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ఆయన పాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా పరిగణిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, సరిహద్దు భద్రత, అక్రమ వలసలు, వాణిజ్య సుంకాల వంటి అంశాలు ఓటర్లను ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయి. అత్యధిక సర్వేల ప్రకారం ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్‌లోని రెండు సభల్లో (ప్రతినిధుల సభ, సెనెట్) రిపబ్లికన్లకు స్వల్ప మెజార్టీ ఉంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు కనీసం ఒక్క సభలోనైనా ఆధిపత్యం సాధిస్తే, అధ్యక్షుడు ట్రంప్ విధానపరమైన నిర్ణయాలకు, చట్టాల ఆమోదానికి అడ్డంకులు



సృష్టించే అవకాశం లభిస్తుంది. అయితే, డెమోక్రాట్లు గెలిస్తే, వారు ప్రతిపాదించే ప్రతి బిల్లును తన వీటో అధికారంతో అడ్డుకుంటానని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టెక్సాస్, మిచిగాన్, ఐయోవా వంటి కీలక రాష్ట్రాల్లో సెనెట్ స్థానాలకు తీవ్రమైన పోటీ నెలకొంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, భారీ సంఖ్యలో ఉన్న మెయిల్-ఇన్ బ్యాలెట్ల లెక్కింపు కారణంగా తుది ఫలితాలపై పూర్తి స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

రామ మందిరం విరాళాల కేసుపై స్వతంత్ర విచారణ జరపాలి

న్యూఢిల్లీ: అయోధ్య రామ మందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల చోరీ కేసు దర్యాప్తుపై కాంగ్రెస్ పార్టీ పలు సందేహాలు వ్యక్తం చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పూర్తయిందని, ఎనిమిది మందిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు ప్రకటించడాన్ని ప్రశ్నించింది. ఆలయ ట్రస్టులో కీలక బాధ్యతలు నిర్వహించిన వ్యక్తుల పాత్రను కూడా పరిశీలించాలని, ఈ కేసుపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు.



105 చోరీ ఘటనలు.. రికవరీపై ప్రశ్నలు

కేవలం 45 రోజుల వ్యవధిలో సీసీటీవీ కెమెరాల్లో 105 చోరీ ఘటనలు నమోదైనట్లు పేర్కొన్న జైరాం రమేశ్.. ఇప్పటివరకు సుమారు రూ.79.85 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. అసలు ఎంత నగదు చోరీకి గురైంది? ఇంకా ఎంత మొత్తం రికవరీ కావాల్సి ఉంది? 105 ఘటనలకు సంబంధించిన ఫుటేజీ మాత్రమే ఎందుకు అందుబాటులో ఉంది? మిగిలిన సీసీటీవీ రికార్డులు ఎక్కడున్నాయి? అని ప్రశ్నించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు చెందిన చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావులను కేసులో సాక్షులుగా పేర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. సాక్షిగా ఉండటానికి, నిందితుడిగా ఉండటానికి మధ్య వ్యత్యాసం ఉందని వ్యాఖ్యానించారు. 2020 ఆడిట్ నివేదికలో విరాళాల నిర్వహణ, ఆర్థిక నియంత్రణ వ్యవస్థలో లోపాలు ఉన్నట్లు ప్రస్తావించినా వాటిపై తీసుకున్న చర్యలను వెల్లడించాలని కోరారు.

ఎఫ్ఐఆర్ నమోదులో 21 రోజుల జాప్యమెందుకు?

ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జరిగిన జాప్యంపైనా జైరాం రమేశ్ ప్రశ్నించారు. జూన్ 4న రూ.2.25 లక్షల నగదు స్వీకరించినట్లు చూపించే వీడియో అప్పటి ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు చేరిందని, జూన్ 5న సీసీటీవీ ఫుటేజీని కూడా ఆయనకు చూపించినట్లు ఛార్జ్‌షీట్ వివరాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ జూన్ 25న ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేశారని ప్రశ్నించారు. మధ్యలో 21 రోజుల పాటు ఏం జరిగిందో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 2న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు దర్యాప్తు పూర్తయిందని, ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపిన నేపథ్యంలో.. దానిని కేసుకు సంబంధించి పూర్తి స్థాయి క్లీన్‌చిట్‌గా భావించరాదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ట్రస్టు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు వచ్చిన విరాళాలు, నగదు, బ్యాంకు ఖాతాలు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు, ఖర్చులపై స్వతంత్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కోరారు.

పార్లమెంట్ ప్రోరోగ్‌పై కేంద్రానికి ప్రశ్నలు

మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 82 రోజులు గడిచినా, అధికారికంగా ప్రోరోగ్ చేయకపోవడంపై జైరాం రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును ఆమోదింపజేసేం దుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలనే ఆలోచనతోనే ఈ జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు.

అరుణాచల్ జనతా పార్టీపై విమర్శలు

అరుణాచల్ ప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటైన అరుణాచల్ జనతా పార్టీ అంశంపైనా జైరాం రమేశ్ స్పందించారు. ఆ పార్టీ వెనుక కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహం ఉందంటూ విమర్శించారు. గతంలో ఇతర పార్టీల నుంచి బయటకు వచ్చిన నేతల కోసం కొత్త రాజకీయ వేదికలను ఉపయోగించుకున్నట్లుగానే, ఇప్పుడు కూడా అలాంటి ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం పబ్లిక్ నోటీసు ప్రకారం అరుణాచల్ జనతా పార్టీ 2026 అక్టోబర్ 16న ఇటానగర్ కేంద్రంగా ఏర్పాటైంది.

నిరసనలకు హద్దులు ఉండాలి

న్యూఢిల్లీ: నిరసనలు చేపట్టడం ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఉన్న హక్కేనని, అయితే ఒకే ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించుకుని ఆందోళనలు కొనసాగించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిరసనలకు నిర్దిష్ట సమయం, కాలపరిమితి ఉండాలని వ్యాఖ్యానించింది. రైతులు, జర్నలిస్టులు, ఇతర వర్గాల వారు కూడా తమ సమస్యలపై అదే వేదికను వినియోగించుకునే అవకాశం ఉండాలని పేర్కొంది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కొనసాగుతున్న ఆందోళనల వల్ల వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటున్నాయంటూ వ్యాపార సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.



ఒకే వేదికపై ఎల్లకాలం నిరసనలు ఎలా?

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక నిరసన కోసం కేటాయించిన ప్రాంతాన్ని ఒకే వర్గం నిరవధికంగా ఆధీనంలో ఉంచుకోవడానికి వీల్లేదని అన్నారు. ఇతర సమస్యలపై ఆందోళనలు చేయాలనుకునే రైతులు, జర్నలిస్టులు, ఇతర వర్గాలు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. నిరసనలకు అనుమతి ఇచ్చినంత మాత్రాన ఆ ప్రాంతాన్ని శాశ్వతంగా ఆక్రమించుకునే హక్కు కల్పించినట్లు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒక నిరసనకు కేటాయించిన సమయం ముగిసిన తర్వాత ఇతర వర్గాలకూ ఆ వేదికను వినియోగించుకునే అవకాశం ఉండాలని పేర్కొంది.

వ్యాపారాలు దెబ్బతింటున్నాయన్న సంఘాలు

కిరాణా వ్యాపారుల సంఘంతో పాటు పలు వ్యాపార సంస్థలు ఈ పిటిషన్ దాఖలు చేశాయి. వాటి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. రామ్‌లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో సుమారు 50 లక్షల మంది నివసిస్తున్నారని, నిరసనల కారణంగా దుకాణాలు మూతపడటంతో వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని కోర్టుకు వివరించారు. పండుగల సమయంలో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కన్నాట్ ప్లేస్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లోనూ వ్యాపార కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. రానున్న రెండు నెలలపాటు నిరసనలపై ఆంక్షలు విధించాలని కోరారు. అయితే, నిరసనల వల్ల నష్టం జరుగుతోందని ఆరోపిస్తున్న వ్యాపార సంఘాలు తమ పిటిషన్‌లో ఆందోళనలు నిర్వహిస్తున్న సంస్థలను కూడా ప్రతివాదులుగా చేర్చాలని సుప్రీంకోర్టు సూచించింది. సంబంధిత వర్గాలన్నింటినీ విచారణలో భాగం చేయకుండా ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని అభిప్రాయపడింది.

నిరసనల పరిణామాలకు నిర్వాహకులదే బాధ్యతా?

కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. నిరసనలకు పిలుపునిచ్చే నిర్వాహకులు వాటి వల్ల తలెత్తే పరిణామాలకు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. గతంలో జూలై 20న నిర్వహించిన నిరసనకు ఒక్కరోజు మాత్రమే అనుమతి ఇచ్చినా, ఆ తర్వాత కూడా ఆందోళనకారులు అక్కడే కొనసాగారని, పార్లమెంట్ వరకు మార్చ్ నిర్వహించాలని ప్రయత్నించారని కోర్టుకు వివరించారు. మరోవైపు, నిరసనల సందర్భంగా సామూహిక నిర్బంధాలు, పోలీసుల దౌర్జన్యాలు, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత వంటి అంశాలపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. తాజా విచారణలో కేంద్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత వర్గాలకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

రైతులు కంట నీరు పెట్టకుండా చూడాల్సిన

ఏఎంసి పాలకవర్గం బాధ్యత

రైతు అభివృద్ధి,సంక్షేమానికి పాటుపడండి

ఇల్లంతకుంట ఏఎంసీ నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి హితవు



రాజన్న సిరిసిల్ల రైతులు కంటనీరు పెట్టకుండా చూడాల్సిన బాధ్యత , ఏ ఎం సి పాలక వర్గం బాధ్యత రైతుల అభివృద్ధి సంక్షేమానికి పాటు పడాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్ పాలకవర్గంపై ఉందని మానకొండూరు ఎమ్మెల్యే టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్ లో మంగళవారం జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ శ్రీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారుమార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా అంతగిరి సాహిత్య వినయ్ కుమార్.వైస్ చైర్మన్‌గా భరత్ రెడ్డి, డైరెక్టర్లుగా వి. మల్లయ్య, బడుగు లింగయ్య, వి. శ్రీనివాస్ రెడ్డి, జెట్టి మల్లేశం, మంద బాల్ రెడ్డి, వెలిశాల జ్యోతి, బంగారి అంజయ్య, ఎరుకల తిరుపతి, జుట్టు నగేష్, ఎం. నవీన్ రెడ్డి, ఉప్పల వేణు, జి. శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరంఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా అందించే సేవలతో రైతులు సంతోషంగా ఉండాలే తప్ప బాధతో కంటనీరు పెట్టే పరిస్థితి కల్పించొద్దన్నారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, మార్కెట్ కమిటీకి రైతులు అండగా ఉండాలన్నారు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, చైర్మన్ నిత్యం రైతుల సమస్యల పరిష్కా రంపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో ఇల్లంతకుంట మార్కెట్ కమిటీని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలన్నారు ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ముందుకు వెళు ్తందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ మార్కెట్ ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మార్కెట్ యార్డును అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తూ రైతులు పండించి పండించిన ధాన్యానికి భద్రత కల్పించేందుకు గోదాముల నిర్మాణం అనేక వసతులు కల్పించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. రైతులకు మార్కెట్లో అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పాలకమండలి పని చేయాలని సందర్భంగా పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి

పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

రోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు రుద్రంగి మండలం మానాల అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలో పిల్లల ఎత్తు బరువును పరిశీలిస్తుండగా తనిఖీ చేశారు. సామ్, మామ్ పిల్లలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో ఆరో వాటర్ యంత్రం పనితీరు, ఫ్యాన్లు, లైట్లు పరిశీలించారు. అలాగే ప్రాథమిక పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తుండగా, తనిఖీ చేశారు. తరగతి గదులు సైతం పరిశీలించారు.ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణులు బాలింతలు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని, దీంతో వారి బంగారు భవితకు బాటలు పడతాయని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 10 వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, ఆరోగ్య కార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. నీటిని వేడి చేసి.. చల్లార్చి తాగించాలని తెలిపారు. టాయిలెట్ వెళ్లిన తరువాత పిల్లలు చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బాలామృతంతో పిల్లలకు ఇష్టమైన కేకులు, లడ్డూలు, బిస్కెట్లు ఇతర ఆహార పదార్థాలు తయారు చేసి ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. బాలల మొదటి వెయ్యి రోజుల దశ కీలకమని, వారికి సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి.. మహిళలు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలని, మందులు అందించాలని ఆదేశించారు. గర్భిణులు నార్మల్ డెలివరీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలాల్ఫ్రెడ్, తహసీల్దార్ పుష్పలత, సర్పంచ్ శంకర్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఇష్టారాజ్యం?

కరీంనగర్ కలెక్టర్ ఛాంబర్ ఎదుట బాధిత దంపతుల బైఠాయింపు

అర్హులకు అన్యాయం.. అనర్హులకు అందలం

గ్రామ కమిటీ ఆగడాలపై ఆగ్రహం



కరీంనగర్ : పేదల సొంతింటి కలను నిజం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకం క్షేత్రస్థాయిలో వివాదాలకు కేంద్రంగా మారుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు కాకపోగా, ఆర్థిక స్థోమత, భూములు ఉన్నవారికి ఇళ్లను కేటాయిస్తున్నారనే విమర్శలు ప్రభుత్వ పథకం అమలులో పారదర్శకతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. గ్రామస్థాయి ఇందిరమ్మ కమిటీల నిర్ణయాలు పేదల పాలిట శాపంగా మారుతున్నాయంటూ బాధితులు ఆందోళనబాట పడుతుండగా, పేదల కోసం ప్రవేశపెట్టిన పథకంలో పేదలకే చోటు లేదా? అన్న ప్రశ్న ఇప్పుడు బాధితుల నుంచి వినిపిస్తోంది. ఇళ్ల కేటాయింపు తీరు గ్రామ కమిటీల సిఫార్సులు, పలుకుబడి, పైరవీలే ప్రామాణికంగా తీసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పథకం పేరుతో పేదలకు ఆశలు కల్పించి, చివరకు జాబితాల్లో మొండిచేయి చూపడమే ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు నిదర్శనమా..? అని బాధితులు నిలదీస్తున్నరు. అయినా స్పందన లేకపోవటంతో, జిల్లా ఉన్నతాధికారి వద్దకే వచ్చి నిరసనలు చేపడుతున్నారు. ఇదే క్రమంలో సైదాపూర్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన రావుల మమత, ఆమె భర్త అశోక్ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తమకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ మంగళవారం కలెక్టర్ ఛాంబర్ ఎదుట బైఠాయించారు. గ్రామ కమిటీల ఏకపక్ష ధోరణి, అవినీతి, అక్రమాలు, ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న అన్యాయంపై నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తాము అత్యంత నిరుపేద కుటుంబానికి చెందినవారమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దరఖాస్తు చేసుకున్నామని మమత తెలిపారు. మొదటి విడతలో ఇల్లు మంజూరైందని అధికారులు చెప్పగా, తమ పాత ఇంటిని సైతం తొలగించుకున్నామని, తీరా లబ్ధిదారుల జాబితాలో పేరు లేకుండా పోయిందని వాపోయారు. అప్పటి నుంచి నివాసం లేకుండా నిరాశ్రయులుగా కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా విడుదలైన రెండో విడత జాబితాలోనూ తమకు చోటు దక్కకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందన్నారు. మరోవైపు గ్రామంలో ఆర్థిక స్థోమత, భూములు ఉన్నవారికి ఇళ్లు కేటాయించారని, నిజమైన నిరుపేదలను మాత్రం పక్కన పెట్టారని ఆమె ఆరోపించారు. గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులను ఈ విషయమై ప్రశ్నించగా 'మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ అవమానకరంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తనకు వైద్య ఖర్చులు భరించే స్తోమత కూడా లేదని, తలదాచుకునేందుకు గూడు లేక కుటుంబం తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని కన్నీటిపర్యంత మయ్యారు. గ్రామ ఇందిరమ్మ కమిటీని రద్దు చేసి ప్రత్యేక అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని, గ్రామంలో మంజూరైన ఇళ్ల జాబితాను పునఃపరిశీలించి అనర్హుల ఎంపికపై చర్యలు తీసుకోవాలని మమత దంపతులు వీరి సమస్య తెలుసుకునేందుకు వచ్చిన కలెక్టరేట్ కార్య నిర్వహణాధికారిని వేసుకున్నారు. కాగా, బాధితుల దరఖాస్తు పరిశీలించిన ఏవో సుధాకర్ ఇల్లు మంజూరీకి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత మండల అధికారులకు సూచించారు.

బడిలో మద్యం తాగుతూ పట్టుబడ్డ హెడ్‌మాస్టర్

ఆసిఫాబాద్ : తిర్యాణి మండలం గంభీరావుపేట ఎంపీయూపీఎస్ పాఠశాలలో హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ మద్యం సేవించి స్కూలుకు వస్తున్నాడని విద్యార్థులు ఆరోపించారు. స్పందించిన గ్రామస్థులు, తల్లిదండ్రులు హెడ్‌మాస్టర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తరువాత స్కూల్ లో జరిగే తతంగం గురించి ఎంఈవోకు ఫిర్యాదు చేసారు.

మియాపూర్ 550 ఎకరాల

ప్రభుత్వ భూములను కాపాడాలి:

వామపక్ష పార్టీల డిమాండ్

స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్‌లలో సీపీఐ(ఎమ్), సీపీఐ(ఎమ్-ఎమ్) మరియు ఎంసీపీఐ(యు) నాయకుల విస్తృత పర్యటన.. మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 100 మరియు 101 లో ఉన్న 550 ఎకరాల అత్యంత ఖరీదైన భూమి పూర్తిగా ప్రభుత్వానిదేనని ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) చారిత్రాత్మక తీర్పునిచ్చిన నేపథ్యంలో, ఈ భూములపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. భూ పరిధిలో ఉన్న పేదల నివాస ప్రాంతాలైన స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్ ప్రజలను పరామర్శించేందుకు, అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకత్వం మరియు ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గం పర్యటించాయి.

పట్టభద్రులారా.. ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దు

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అర్హులైన పట్టభద్రులు ప్రత్యేక దృష్టి సారించాలి

ఓటు నమోదు చేసుకున్నప్పుడే ప్రశ్నించే హక్కుకు సార్థకత:

కారేపల్లి, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల మాజీ సీనియర్ జర్నలిస్టు అజ్మీరా వీరన్న పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు పట్ల విద్యావంతులు నిర్లక్ష్యం ప్రదర్శించడం ఆందోళనకరమన్నారు.మండల పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవడంలో చాలామంది ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకుని, వారి ఆకాంక్షలను శాసనమండలిలో బలంగా వినిపించే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం విద్యావంతుల చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు.ఓటు హక్కును నమోదు చేసుకోకుండా ఎన్నికల సమయంలో నాయకులను ప్రశ్నించడం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, ప్రజాస్వామ్యంలో తమ భాగస్వామ్యాన్ని చాటుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం ప్రతి పట్టభద్రుడి బాధ్యత అని అన్నారు. విద్యావంతులు రాజకీయ వ్యవస్థలో చురుకైన పాత్ర పోషించినప్పుడే ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన సమర్థవంతమైన నాయకత్వం బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు.కావున మండలంలోని డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు, ఇతర అర్హులైన పట్టభద్రులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని అజ్మీరా వీరన్న విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల గొంతుక బలంగా వినిపించాలంటే ప్రతి అర్హుడి ఓటు కీలకమని ఆయన పేర్కొన్నారు.

ప్రజల ఇబ్బందుల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

భూపతిరాయుని చెరువు కట్టకు కొత్త రూపు.. పిచ్చిమొక్కల తొలగింపు

సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ చొరవతో పారిశుద్ధ్య పనులు

కారేపల్లి : గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే లక్ష్యంగా గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ముందుకు సాగుతున్నారు. గ్రామ అభివృద్ధితో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు.గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని భూపతిరాయుని చెరువు కట్టపై రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామస్తులు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి, చెరువు కట్టపై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందిస్తూ చెరువు కట్టపై పిచ్చిమొక్కలు తొలగించడంపై గ్రామస్తులు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ చొరవను అభినందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆరు తడి పంటలు మాత్రమే వేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్.

కమాన్ పూర్ : రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని పెద్దపెల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్ అన్నారు. గుండారం గ్రామంలోని రైతు వేదికలో గిరి రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులచే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షాలు కురియక డ్యాములు నిండగా పోవడంతో సాగునీరుకు ఆటంకం ఏర్పడనున్నదాని అన్నారు. రబీ సీజన్ లో ప్రతి రైతు ఆడుతాది పంటలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి కంది పెసరు మక్కా వంటి విత్తనాలు వేయాలని కోరారు. అలాగే ఏపీఎంఏ అసోసియేషన్ ఆఫ్ ఫెర్టిసైడ్స్ మ్యానుఫ్యాక్చర్ తెలంగాణ ప్రతినిధి జి అశోక్ కుమార్ టాటా ర్యాలీస్ మాట్లాడుతూ పురుగుల మందుల పిచికారి సమయంలో రైతు సోదరులు పాటించవలసిన పద్ధతులను పురుగుమందుల తీవ్రతను తెలియజేసే గుర్తులపై అవగాహన కల్పించారు. అదే విధంగా వ్యవసాయ సంచాలకులు అంజలి మాట్లాడుతూ నేల సారాన్ని కాపాడుకోవాలని వరి కోసిన తర్వాత నిప్పు పెట్టకూడదని అన్నారు. ఈ సమావేశంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ జిల్లాలో రూ.1,778.51 కోట్ల వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ

నాగర్ కర్నూల్ : నాగర్ కర్నూల్ జిల్లాలో రూ.1,778 కోట్లకు పైగా వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు జిల్లాలో కరువు ప్రభావిత మండలాల వారీగా పంట నష్టాల తీవ్రత గుర్తింపు గ్రామాల వారీగా రుణ పునర్వ్యవస్థీకరణకు అర్హులైన రైతుల గుర్తింపు అర్హులైన రైతులకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం జిల్లాలో కరువు పరిస్థితులపై బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.. తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు 12 నెలల రుణ మారటోరియం తీవ్ర కరువు మండలాల్లో రుణ చెల్లింపు గడువు గరిష్ఠంగా 60 నెలలకు పొడిగింపు, పాక్షిక కరువు మండలాల్లో రుణ చెల్లింపు గడువు 36 నెలల వరకు పొడిగింపు వుంటుందని అన్నారు. . స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీతో సహా మధ్యకాలిక రుణాలుగా మార్చే అవకాశం వుంటుందని అన్నారు. జిల్లాలో 65,893 మంది రైతులకు రూ.1,125.10 కోట్ల పంట రుణాల మంజూరు, మరో 27,297 మంది రైతులకు రూ.653.41 కోట్ల వ్యవసాయ కాలపరిమితి రుణాలు. అర్హులైన రైతులందరికీ రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందించాలని కలెక్టర్ అన్నారు తదుపరి పంటల సాగుకు కొత్త పంట రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలి. కరువు ప్రభావిత రైతులపై రుణ వసూళ్ల ఒత్తిడి, బెదిరింపులు చేయరాదు, రైతుల నుంచి బలవంతపు రుణ వసూళ్లు చేపట్టకూడదని బ్యాంకులకు కలెక్టర్ ఆదేశం ఇచ్చారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా రుణ పునర్వ్యవస్థీకరణపై అవగాహన కల్పించాలి. వ్యవసాయ శాఖ, బ్యాంకులు సమన్వయంతో గ్రామాల వారీగా అర్హులైన రైతులను గుర్తించాలి. వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో బ్యాంకుల సమన్వయ సమావేశాలు నిర్వహించాలిరుణ పునర్వ్యవస్థీకరణ అమలుపై పురోగతి నివేదికలు సమర్పించాలని అధికారులకు ఆదేశం ఇచ్చారు..

బిజినెస్

దలాల్ స్ట్రీట్‌లో దూసుకెళ్లిన సూచీలు.. సెన్సెక్స్ 1,225 పాయింట్లు జంప్

76,917.85 వద్ద ముగిసిన సెన్సెక్స్
నిఫ్టీ 370.05 పాయింట్లు పెరిగి 23,810.85కు చేరిక
వరుసగా నాలుగో సెషన్‌లోనూ మార్కెట్లకు లాభాలు
బ్రెంట్ క్రూడ్ ధర తగ్గడంతో ఇన్వెస్టర్లలో ఆశావాదం
ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడులు తిరిగి రావడం, కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఇన్వెస్టర్లలో ఆశలు పెంచడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,225.07 పాయింట్లు (1.62 శాతం) ఎగబాకి 76,917.85 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 370.05 పాయింట్లు (1.58 శాతం) పెరిగి 23,810.85 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ కీలకమైన 23,800 పాయింట్ల స్థాయిని తిరిగి అధిగమించింది. వరుసగా నాలుగో సెషన్‌లోనూ మార్కెట్లు లాభాలు నమోదు చేశాయి. ఈ నాలుగు సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 5 శాతం మేర పెరిగాయి. మార్కెట్ ర్యాలీకి ప్రధానంగా ముడిచమురు ధరల తగ్గుదల తోడైంది. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ధర గత సెషన్‌లో సుమారు 7 శాతం పడిపోయి బ్యారెల్‌కు 105 డాలర్ల స్థాయికి చేరింది. అమెరికా–ఇరాన్ మధ్య దౌత్య చర్చల్లో పురోగతి ఉండొచ్చన్న సంకేతాలతో సరఫరాకు ఆటంకాలు తగ్గుతాయనే అంచనాలు ఏర్పడ్డాయి. భారత్ తన చమురు అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. అందువల్ల ముడిచమురు ధరలు తగ్గితే దేశ దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. కంపెనీలకు ముడిసరుకు, ఇంధన వ్యయాలు తగ్గుతాయన్న ఆశలతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. మరోవైపు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత ఈక్విటీ మార్కెట్లలో మళ్లీ కొనుగోళ్లు చేపట్టడం కూడా సూచీలకు బలాన్నిచ్చింది. రంగాలవారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ షేర్లు అత్యధికంగా పుంజుకున్నాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీ 2.5 శాతం పెరిగింది. రియల్టీ సూచీ 2.2 శాతం, ప్రైవేట్ బ్యాంకుల సూచీ 1.78 శాతం లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఆటో, మీడియా రంగాల షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. నిఫ్టీ 50లో బీఎస్ఈ లిమిటెడ్, టాటా కన్స్యూమర్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడిన వాటిలో ముందున్నాయి. మరోవైపు ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి. మొత్తం 16 ప్రధాన రంగాల సూచీల్లో 13 లాభాలతో ముగిశాయి. హెచ్‌యూఎల్ షేరు దాదాపు 4 శాతం పెరిగింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కొనుగోళ్లు జరిగాయి. ఈ పరిణామం మార్కెట్ లాభాలు కేవలం పెద్ద కంపెనీలకే పరిమితం కాలేదని సూచించింది. అయితే అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరల్లో మార్పులు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కంపెనీల క్యూ2 ఫలితాలు తదుపరి సెషన్లలోనూ మార్కెట్ దిశను ప్రభావితం చేయనున్నాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపైనా ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నారు.

హ్యాకింగ్ దెబ్బకు బైనాన్స్ విలవిల..

రూ.45,000 కోట్ల క్రిప్టో పెట్టుబడులు వెనక్కి!



న్యూయార్క్, నవంబర్ 2: క్రిప్టోకరెన్సీ మార్కెట్‌ను బైనాన్స్ హ్యాకింగ్ కలవరపెడుతున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీ బైనాన్స్‌లో సైబర్ దాడి జరిగిన విషయం తెలిసిందే. గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఏకంగా 6.3 బిలియన్ డాలర్ల (ఇంచుమించుగా రూ.60, 000 కోట్లు) ఆస్తులు దోపిడీకి గురయ్యాయి. అనుమానం వచ్చిన తక్షణమే ట్రేడింగ్‌ను ఆపేశారు. మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ ఈ స్థాయిలో హ్యాకింగ్‌తో నష్టం వాటిల్లలేదు మరి. ఈ క్రమంలో ఆదివారం మళ్లీ తెరుచుకున్న బైనాన్స్ క్రిప్టో ఎక్స్ఛేంజీ నుంచి మదుపర్లు పెద్ద ఎత్తున ఉపసంహరణలకు దిగారు. సైబర్ దాడి నేపథ్యంలో ఎక్స్ఛేంజీ ఇచ్చిన 3 రోజుల విరామం భారత కాలమానం ప్రకారం ఉదయం 11:30 గంటలకు తొలిగిపోయింది. అయితే ఆ వెంటనే భారీగా విత్‌డ్రాయల్స్ మొదలయ్యాయి. ఈ దెబ్బకు పాపులర్ క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ 75,000 డాలర్ల దిగువకు దిగజారింది. మరిన్ని ప్రధాన క్రిప్టోకరెన్సీలూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

వేల కోట్లలో విత్‌డ్రాయల్స్

ఒక్కరోజే ఏకంగా 4.72 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.45,000 కోట్లు) బైనాన్స్ ఎక్స్ఛేంజీకి దూరమయ్యాయి. ఈ ఎక్స్ఛేంజీలో ఉన్న ఆస్తుల విలువలో ఇది సుమారు 2.8 శాతానికి సమానం కావడం గమనార్హం. బైనాన్స్ నిర్వహణలో మొత్తం 171 బిలియన్ డాలర్ల ఆస్తులున్నాయి. ఇక ఈ హ్యాకింగ్ వెనుక ఉత్తర కొరియాకు చెందిన సైబర్ కేటుగాళ్లు ఉన్నారని చెప్తున్నారు. ట్రేడర్‌ట్రైటర్ అనే సంస్థే ఈ హ్యాకింగ్‌కు కారణమని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ అంటున్నది. గత ఏడాది 1.5 బిలియన్ డాలర్ల హ్యాకింగ్ వెనుకా ఇదే ఉన్నదని గుర్తుచేస్తున్నది. ఈ నేపథ్యంలోనే క్రిప్టో ఎక్స్ఛేంజీలు, బ్లాక్‌చైన్ అనలిటిక్స్ కంపెనీలు, ఇతరులను అనుమానిత లావాదేవీలను నిలిపివేయాలని సూచించింది. దొంగిలించిన ఆస్తులను ట్రేడర్‌ట్రైటర్.. ఎంథీరమ్ క్రిప్టోకరెన్సీలోకి మార్చుతున్నట్టు ఎఫ్‌బీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. మరోవైపు అపహరణకు గురైన క్రిప్టో ఆస్తులను తిరిగి రికవరీ చేస్తామన్న ధీమాను బైనాన్స్ ఎక్స్ఛేంజీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు 90 శాతం వెనక్కి వస్తుందంటున్న బైనాన్స్.. ఈ క్రమంలోనే దొంగిలించబడిన ఆస్తుల్లో దాదాపు 3 బిలియన్ డాలర్లను ఫ్రీజ్ చేయడానికి ఇతర క్రిప్టోకరెన్సీ సంస్థలతో కలిసి పనిచేసినట్టు కూడా పేర్కొన్నది.

ఈ నష్టం ఎవరిది?

బైనాన్స్ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీలో హ్యాంకింగ్.. మదుపర్లకు అపార నష్టాన్నే మిగిల్చింది. దీంతో ఈ నష్టం ఇప్పుడు ఎవరు భరిస్తారు? అన్న సందేహాలు మార్కెట్‌వ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి. అయితే ఎక్స్ఛేంజీ కాంట్రాక్చువల్ ఆబ్లిగేషన్స్, నిర్వహణలో ఉన్న ఆస్తులు ఎన్ని? అనే దానిపై ఆధారపడి ఉంటుందని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఆస్తుల యాజమాన్య హక్కులు మదుపర్లకు ఉన్నా.. వాటి ట్రేడింగ్, ఇతరత్రా లావాదేవీలను ఎక్స్ఛేంజీలే చూసుకుం టాయని అంటున్నారు. అందుకే ఇక్కడ ఒప్పందాల్లో ఏమున్నదన్నది కీలకమని గుర్తుచేస్తున్నారు. అయితే సైబర్ దాడుల్లో వాటిల్లిన నష్టాలకైతే నిజానికి ఎక్స్ఛేంజీల వైఫల్యాలే కారణమని వివరిస్తున్నారు. అయినప్పటికీ చట్టాలపరంగా చూస్తే మొత్తం బాధ్యతను ఎక్స్ఛేంజీలపైనే పెట్టలేమన్న తీర్పులు గతంలో వచ్చాయని పేర్కొంటున్నారు. కానీ ఈ నష్టాన్ని భర్తీ చేస్తామని ఈ కేసులో బైనాన్స్ హామీ ఇచ్చినందున మదుపర్లు అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న అభిప్రాయాలనైతే వారు వెలిబుచ్చుతున్నా రు. ఇక భారత్‌లో ఈ తరహా ఘటనల్ని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ–2002) కిందికి తెచ్చి చర్యలు చేపడుతున్నారు. ఒకవేళ ఎక్స్ఛేంజీలు దివాలా తీస్తే దివాలా చట్టం (ఐబీసీ–2016) కింద మదుపర్ల ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయాలను తీసుకుంటున్నారని లా ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

లాభాల్లో ఎస్‌బీఐ దూకుడు.. మూడు నెలల్లో రూ.23,038 కోట్లు

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ 2026–27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలు నమోదు చేసింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14.3 శాతం పెరిగి రూ.23, 038 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకు రూ.20,160 కోట్ల లాభాన్ని ఆర్జించింది. వడ్డీ ఆదాయంలో వృద్ధి, రుణ నష్టాల కోసం కేటాయింపులు తగ్గడం లాభం పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 15 శాతం పెరిగి రూ.49,143 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో ఇది రూ.42,847 కోట్లుగా ఉంది. రుణాలపై వచ్చిన వడ్డీకి, డిపాజిట్లపై చెల్లించిన వడ్డీకి మధ్య ఉన్న తేడానే నికర వడ్డీ ఆదాయం. మరోవైపు, నిర్వహణ లాభం మాత్రం 1.4 శాతం తగ్గి రూ.26,937 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.27,311 కోట్లుగా నమోదైంది. ఈసారి రూ.7,288 కోట్ల మేర ఒకేసారి వచ్చిన ఆదాయం కూడా బ్యాంకు లాభానికి అదనపు ఊతమిచ్చింది. రుణాల నాణ్యతలోనూ ఎస్‌బీఐ మెరుగుదల సాధించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.39 శాతానికి తగ్గింది. జూన్ త్రైమాసికంలో ఇది 1.47 శాతంగా ఉంది. నికర నిరర్థక ఆస్తుల (ఎన్ఎన్‌పీఏ) నిష్పత్తి కూడా 0.38 శాతం నుంచి 0.36 శాతానికి దిగివచ్చింది. రుణ నష్టాల కోసం చేసిన కేటాయింపులు గత ఏడాది ఇదే కాలంలోని రూ.5,400 కోట్ల నుంచి రూ.4,217 కోట్లకు తగ్గాయి.



ఐపీఎల్‌లో భారీ ట్రేడ్: పంజాబ్‌కు హార్దిక్.. ముంబైకి అర్ష్‌దీప్!

హార్దిక్ పాండ్యాను పంజాబ్‌కు బదిలీ చేయనున్న ముంబై ఇండియన్స్
బదులుగా పేసర్ అర్ష్‌దీప్ సింగ్, విష్ణు వినోద్‌లను తీసుకోనున్న ముంబై
ఇరు ఫ్రాంచైజీల మధ్య ఒప్పందం దాదాపు ఖరారైనట్లు కథనాల వెల్లడి
గతంలో కేకేఆర్, రాజస్థాన్, చెన్నైలతో ట్రేడింగ్ చర్చలు విఫలం
ఈ డీల్‌తో ఐపీఎల్ ట్రేడ్ మార్కెట్‌లో మరిన్ని మార్పులకు అవకాశం





ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) రిటెన్షన్ గడువు సమీపిస్తున్న వేళ, క్రికెట్ వర్గాల్లో సంచలనం సృష్టించే పరిణామం ఒకటి చోటుచేసుకుంది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్‌కు బదిలీ చేసేందుకు ముంబై ఇండియన్స్ (ఎంఐ) అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ మెగా ట్రేడ్‌లో భాగంగా పంజాబ్ నుంచి యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్, వికెట్ కీపర్ బ్యాటర్ విష్ణు వినోద్ ముంబై ఇండియన్స్ జట్టులోకి రానున్నారు. ప్రముఖ క్రీడా మ్యాగజైన్ 'స్పోర్ట్‌స్టార్' తన కథనంలో ఈ విషయాన్ని వెల్లడించింది. ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) ఉన్నత యాజమాన్యాల మధ్య చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లు పేర్కొంది. అయితే, ఈ భారీ డీల్‌పై ఇరు ఫ్రాంచైజీలు ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. "రికీ పాంటింగ్ కోచ్‌గా ఉన్న ఫ్రాంచైజీ (పంజాబ్) ముంబై ఇండియన్స్‌తో చర్చలలో పురోగతి సాధించింది. హార్దిక్ పాండ్యాకు బదులుగా పేసర్ అర్ష్‌దీప్ సింగ్, వికెట్ కీపర్ విష్ణు వినోద్‌లను పంపే అవకాశం ఉంది" అని ఆ కథనం పేర్కొంది. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసినప్పటి నుంచి హార్దిక్ పాండ్యాను ముంబై యాజమాన్యం వదులుకోవాలని చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) వంటి జట్లతో ముంబై చర్చలు జరిపింది. హార్దిక్‌కు బదులుగా హర్షిత్ రాణా, అంగ్‌క్రిష్ రఘువంశీలను కేకేఆర్ నుంచి ముంబై కోరగా, అందుకు ఆ జట్టు నిరాకరించింది. అలాగే, యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్‌ల కోసం రాజస్థాన్‌తో, ఆయుష్ మాత్రే కోసం చెన్నైతో జరిపిన చర్చలు కూడా విఫలమయ్యాయి. అయితే, ఎవరూ ఊహించని విధంగా పంజాబ్‌తో డీల్ ఖరారైనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 తర్వాత గాయంతో మైదానానికి దూరంగా ఉన్న హార్దిక్, నేరుగా ఐపీఎల్ 2027 సీజన్‌లోనే ఆడతాడని అంచనా. ఈ అనూహ్య ట్రేడ్ కారణంగా ఐపీఎల్ మార్కెట్‌లో మరిన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. ఈ డీల్ తర్వాత పంజాబ్ జట్టు, మార్కస్ స్టోయినిస్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసి, వారి నుంచి ఎడమచేతి వాటం పేసర్ మొహ్సిన్ ఖాన్‌ను తీసుకునేందుకు ప్రయత్నించవచ్చని కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

కోహ్లీ, రోహిత్‌ల విషయంలో మా ప్లాన్స్ ఇవే.. న్యూజిలాండ్ కెప్టెన్ శాంట్నర్



భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను కట్టడి చేయడంపై న్యూజిలాండ్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఐదు వన్డేల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ వీలైనంత త్వరగా ఆ ఇద్దరినీ ఔట్ చేయాలని భావిస్తున్నట్లు న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ వెల్లడించాడు. బుధవారం ఈడెన్ పార్క్‌లో తొలి వన్డేతో సిరీస్ ప్రారంభం కానుంది. కోహ్లీ, రోహిత్ న్యూజిలాండ్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి వారి ఆటపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇద్దరూ కలిసి ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యాలు కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న ఈ ఇద్దరు బ్యాటర్లను ఆరంభంలోనే అడ్డుకోవాలని శాంట్నర్ భావిస్తున్నాడు. భారత టాప్ ఆర్డర్ బలమేంటో తమకు చాలాకాలంగా తెలుసని చెప్పాడు. రోహిత్, కోహ్లీ ఆరంభంలో వేగంగా పరుగులు సాధించి జట్టుకు మంచి పునాది వేస్తారని, ఆ తర్వాత మధ్య, చివరి ఓవర్లలో భారీ స్కోరుకు అవకాశం కల్పిస్తారని వివరించాడు. పిచ్ నుంచి సీమర్లకు కొంత సహకారం లభిస్తే కోహ్లీ, రోహిత్‌లను నిలువరించడం సులభమవుతుందని శాంట్నర్ అభిప్రాయపడ్డాడు. పిచ్‌పై బంతి కదలిక ఉంటే పేసర్లు ప్రభావం చూపగలరని చెప్పాడు.

స్పోర్ట్స్

సొంత ఖర్చుతోనే సింధు, లక్ష్యసేన్ విజయాలు.. భారత షట్లర్లకు నిధుల కష్టాలు!

యూరప్ పర్యటనకు నిధులు విడుదల చేయని సాయ్
ఆటగాళ్లే ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులు భరించిన వైనం
కొందరు ఆటగాళ్లు కోచ్‌లు లేకుండానే పోటీల్లో పాల్గొన్న దుస్థితి
గడువులోగా ప్రతిపాదన ఇవ్వలేదని సాయ్ వివరణ
ఆసియా క్రీడల ఫలితాల వల్లే నిధులు ఆగాయన్న వాదనను ఖండించిన సాయ్



భారత బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, లక్ష్యసేన్ యూరప్ పర్యటనలో టైటిళ్లు గెలిచి సత్తా చాటారు. అయితే ఆ టోర్నీలకు వెళ్లేందుకు అవసరమైన ఖర్చుల విషయంలో వాళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫిన్లాండ్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీల్లో జరిగిన నాలుగు టోర్నీలకు భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) నిధులు విడుదల చేయలేదని సమాచారం. 'ఇండియన్ ఎక్స్ ప్రెస్'ను ఉటంకిస్తూ 'ఇండియా టుడే' కథనం ప్రకారం.. ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులను ఆటగాళ్లే భరించాల్సి వచ్చింది. నిధులు అందకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సింధు.. కొంత ఖర్చును తానే భరించానని, ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సంస్థ కూడా సాయం చేసిందని తెలిపింది. నిధుల కొరత ప్రభావం ఆటగాళ్ల సహాయక సిబ్బందిపైనా పడింది. కోచ్‌ల ఖర్చులు భరించలేక కొందరు వారిని వెంట తీసుకెళ్లలేకపోయారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అష్మితా చాలిహా, డెన్మార్క్ ఓపెన్‌లో తన్వీ శర్మ కోచ్ సహాయం లేకుండానే పోటీపడ్డారు. నిధులు నిలిచిపోవడానికి కారణంపై భిన్న కథనాలు వెలువడ్డాయి. ఆసియా క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రదర్శన దీనికి కారణమై ఉండొచ్చని కొందరు అనుమానించినా.. ఆ వాదనను సాయ్ అధికారి ఖండించారు. టోర్నీలకు 30 రోజుల ముందుగా సమర్పించాల్సిన ప్రతిపాదనను బ్యాడ్మింటన్ సంఘం (బీఏఐ) గడువులోగా ఇవ్వకపోవడంతో నిధులు విడుదల కాలేదని వివరించారు. నిధుల ఇబ్బందుల నేపథ్యంలోనూ భారత ఆటగాళ్లు మంచి ఫలితాలు సాధించారు. జర్మనీలో జరిగిన హైలో ఓపెన్‌లో లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలవగా, సింధు మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. ఈ ఏడాది ఆమెకు ఇది రెండో టైటిల్. మరోవైపు, రాబోయే టోర్నీలకు నిధుల సాయం పునరుద్ధరిస్తామని సాయ్ తెలిపినట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. అయితే యూరప్ పర్యటనలో ఆటగాళ్లు స్వయంగా పెట్టుకున్న ఖర్చులను తిరిగి చెల్లించబోమని స్పష్టం చేసినట్లు తెలిపింది.



గేమింగ్ రంగంలోకి సూపర్ స్టార్ మహేశ్ బాబు..

'టేక్‌డౌన్: జెనెసిస్'తో కొత్త ప్రయాణం!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు మరో కొత్త రంగంలోకి అడుగుపెట్టారు. ఇప్పటివరకు వెండితెరపై తన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన.. ఇప్పుడు గేమింగ్ పరిశ్రమలోనూ తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు. ముంబైకి చెందిన ప్రముఖ ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ షార్ట్ గన్ గేమ్స్‌లో వ్యూహాత్మక పెట్టుబడిదారుగా చేరారు. ఈ భాగస్వామ్యంతో మహేశ్ బాబు వ్యాపార ప్రయాణంలో మరో ఆసక్తికరమైన అధ్యాయం మొదలైంది. సినిమాలతో పాటు వ్యాపార రంగాలపైనా ఆసక్తి చూపించే మహేశ్ బాబు.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న గేమింగ్ పరిశ్రమలోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొత్త భాగస్వామ్యం ద్వారా గేమింగ్ రంగంలో తన ఉనికిని చాటుకోవాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. మహేశ్ బాబు పెట్టుబడిదారుగా చేరిన షార్ట్ గన్ గేమ్స్ సంస్థ 'టేక్‌డౌన్: జెనెసిస్' పేరుతో ఓ యాక్షన్ అడ్వెంచర్ గేమ్‌ను అభివృద్ధి చేయనుంది. ఈ గేమ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ప్రస్తుతం వెల్లడికాలేదు. గేమ్ కథాంశం, ప్రత్యేకతలు, ఏయే వేదికల్లో అందుబాటులోకి వస్తుంది, విడుదల తేదీ వంటి అంశాలపై సంస్థ ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అలాగే ఈ సంస్థలో మహేశ్ బాబు ఎంత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టారనే వివరాలను కూడా వెల్లడించలేదు. ఆయన ఈ ప్రాజెక్టులో వ్యూహాత్మక పెట్టుబడిదారుగా భాగస్వామ్యం కావడం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం. మహేశ్ బాబు ఇప్పటికే సినిమాలతో పాటు పలు వ్యాపార కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఇప్పుడు గేమింగ్ రంగంలోకి అడుగుపెట్టడం ఆయన వ్యాపార ఆసక్తులకు మరో ఉదాహరణగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ పరిశ్రమకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడం ఆసక్తికరమైన పరిణామంగా మారింది.ముఖ్యంగా ప్రముఖ సినీ నటుడు ఈ ప్రాజెక్టులో భాగస్వామి కావడంతో 'టేక్‌డౌన్: జెనెసిస్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగే అవకాశం ఉంది. అయితే గేమ్ విజయానికి దాని కథ, రూపకల్పన, ఆటగాళ్లకు అందించే అనుభూతి వంటి అంశాలు కీలకం కానున్నాయి. సూపర్ స్టార్ కొత్త రంగంలోకి అడుగుపెట్టారనే వార్తతో అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు. ఇప్పటివరకు సినిమాల్లో మాత్రమే చూసిన మహేశ్ బాబు పేరు ఇప్పుడు గేమింగ్ ప్రపంచంలోనూ వినిపించనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా ఆయనకు ఎలాంటి ఫలితాలు వస్తాయి? 'టేక్‌డౌన్: జెనెసిస్' గేమ్ ఎప్పుడు విడుదలవుతుంది? అందులో మహేశ్ బాబు భాగస్వామ్యం ఏ స్థాయిలో ఉండనుంది? అనే ప్రశ్నలకు సంస్థ నుంచి వచ్చే తదుపరి ప్రకటనలతో సమాధానాలు లభించనున్నాయి.

హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమైన సూర్య.. 'సీన్'పై భారీ అంచనాలు!




2026 సంవత్సరం కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కెరీర్‌కు గోల్డెన్ పీరియడ్‌లా మారిపోయింది. దాదాపు దశాబ్ద కాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాలు లేక ఇబ్బంది పడిన సూర్య, ఈ ఏడాది ఏకంగా రెండు బ్లాక్‌బస్టర్ హిట్‌లతో తన సత్తా చాటారు. 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాలతో రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త జోరుమీదున్న సూర్య, ఇప్పుడు తన మూడో సినిమా 'సీన్'తో హ్యాట్రిక్ విజయం సాధించేందుకు సిద్ధమవుతున్నారు. నవంబర్ 6న విడుదల కానున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా 'ఎన్‌జీకే', 'కంగువ' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో సూర్య కథల ఎంపికపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే, వాటి నుంచి పాఠాలు నేర్చుకున్న ఆయన ఈ ఏడాది పూర్తిగా భిన్నమైన కథలతో ప్రేక్షకుల ముందుకు వచ్చి అదరగొట్టారు. మొదట ఆర్‌జే బాలాజీ దర్శకత్వం లో వచ్చిన ఫాంటసీ సోషల్ డ్రామా 'కరుప్పు' సినిమాతో సూర్యకు భారీ బ్రేక్ లభించింది. చట్టంలోని లూప్‌హోల్స్‌ను ప్రశ్నిస్తూనే, కమర్షియ ల్ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ. 300 కోట్లు వసూలు చేసి ఆయన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితో కలిసి సూర్య చేసిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రం కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆక ట్టుకుంది. వయసులో తేడా ఉన్న ప్రేమకథాం శంతో తెరకెక్కిన ఈ చిత్రం ఎలాంటి భారీ యాక్షన్ సీన్లు లేకుండా కేవలం బలమైన భావోద్వేగాలు, చక్కని హాస్యంతో బాక్సాఫీస్ వద్ద రూ. 209 కోట్లకు పైగా వసూలు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా ఘన విజయం సాధించడం విశేషం. ఇలా ఈ రెండు సినిమాల ద్వారా సూర్య తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో మరోసారి నిరూపించారు. ఇప్పుడు మలయాళంలో 'రోమాంచం', 'ఆవేశం' వంటి విభిన్న చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న జితూ మాధవన్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'సీన్'. నజ్రియా నజీమ్, నాస్లెన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. విభిన్నమైన కథాంశాలతో దూసుకుపోతున్న సూర్య, ఈసారికూడా విజయం సాధించి 2026ను తన నామ సంవత్సరంగా మార్చుకుంటారా లేదా అనేది నవంబర్ 6న తేలనుంది.

మమితా బైజు అసలు పేరు ఏంటో తెలుసా..? ఓ మిస్టేక్ వల్ల ఈ పేరు వచ్చిందట!



మమితా బైజు.. ఇప్పుడు సౌత్‌ఇండియాలో ఈ పేరు ఒక సంచలనం. ప్రేమలు మూవీతో మలయాళీలతో పాటు తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ బ్యూటీ.. ఆ తర్వాత వరస సినిమాలతో దూసుకెళ్తోంది. ఇటీవల విశ్వనాథ్ అండ్ సన్స్, బెల్లెహోమ్ కుటుంబం యూనిట్‌తో భారీ విజయాలను అందుకుంది. ఈ ఏడాదిలో అత్యధిక హిట్లు అందుకున్న దక్షిణాది బూటీ మమితనే. తాజాగా ఈ బ్యూటీ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. ఇండస్ట్రీ మొత్తం మార్మోగుతున్న మమిత అనే పేరు..తనది కాదని..ఓ పొరపాటు వల్ల అసలు పేరు మారిపోయి ఈ పేరు స్థిరపడిందని వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మమిత మాట్లాడుతూ... 'నేను పుట్టినప్పుడు అమ్మనాన్నలు పెట్టిన పేరు నమిత. కానీ బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే సమయంలో జరిగిన పొరపాటు వల్ల 'నమిత' కాస్తా 'మమిత'గా రాశారు. ఈ విషయాన్ని మా వాళ్లు నాలుగైదేళ్ల వరకు గమనించలేదు. చివరికి నన్ను స్కూల్‌లో జాయిన్ చేసినప్పుడు సర్టిఫికెట్‌లో పేరు చూసి షాక్ అయ్యారు. కాకపోతే అప్పటికే చాలా ఏళ్లు గడిచిపోవడంతో చేసేదేమీ లేక వాళ్లకి ఇష్టం లేకున్నా ఆ పేరునే కొనసాగించారు. అలా నా పేరు నమిత నుంచి మమితగా మారిపోయింది' అని మమిత చెప్పుకొచ్చింది.

ఓటీటీలో 'రణబాలి'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన తాజా చిత్రం 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద కూడా వసూళు ఫర్వాలేదనిపించింది. కాగా, ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ విడుదలకు సిద్ధమైంది.

విడుదల తేదీపై సందేహాలు 'రణబాలి' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకులను అలరించనుంది. ఈ నెల 13 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ ఇటీవలే అధికారికంగా ప్రకటించినప్పటికీ.. ఆ తర్వాత ఆ పోస్టును తొలగించింది. దీంతో సినిమా ఓటీటీ విడుదల తేదీపై సందేహాలు నెలకొన్నాయి. నెట్‌ఫ్లిక్స్ ప్రకటించిన తేదీనే సినిమా స్ట్రీమింగ్ అవుతుందా? లేక విడుదల తేదీలో మార్పులు ఉంటాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై ఓటీటీ సంస్థ నుంచి మరో సారి స్పష్టత రావాల్సి ఉంది. 1876--78 మధ్యకాలంలో మద్రాసు ప్రెసిడెన్సీలో వచ్చిన భయంకరమైన కరువు నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. మద్రాసుకు కొత్తగా వచ్చిన కమిషనర్(ఆర్నాల్డ్ వోస్లూ)..అధికారులకు కొత్త కండీషన్ పెడతారు. ఇక్కడ పండించిన ప్రతి గింజా బ్రిటన్‌కు వెళ్లాల్సిందేనని ఆదేశిస్తాడు. ఎదురు తిరిగిన వాళ్లను దారుణంగా చంపేస్తాడు. ధాన్యాన్ని దేశం దాటించడానికి రైల్వే పనులు ప్రారంభిస్తాడు. కరువు సృష్టించి.. అక్కడ ప్రజలను పనికి వచ్చేలా చేస్తాడు. ఈ విషయం రాయలసీమ ప్రాంతానికి చెందిన పాలెగాడు సింగనమల బొబ్బిలి రణబాలి (విజయ్ దేవరకొండ) దృష్టికి వెళ్తుంది. భద్రమల్లన్న స్వామి ఆయుష్షుతో పెరిగిన రణబాలి.. బ్రిటీష్ పాలకులకు ఎలా ఎదురుదిరిగాడు? తినడానికి తిండిలేక అతి భయంకరమైన కరువుతో బాధపడుతున్న ప్రజలకు ఎలా అండగా నిలిచాడు? కరువుకు కారణమైన మద్రాసు కమిషనర్‌ని ఎలా అంతం చేశాడు? ఈ కథలో జయమ్మ(రష్మిక) పాత్ర ఏంటి? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

షారుఖ్ ఖాన్ 'కింగ్' సంచలనం..

విడుదల ముందే రూ. 800 కోట్ల భారీ బిజినెస్!



బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'కింగ్' తెరపైకి రాకముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం డిసెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అయితే, సినిమా థియేటర్లోకి రాకముందే ప్రీ-రిలీజ్ బిజినెస్ పరంగా భారీ వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల విడుదలైన 'తు మిలా జాయే' సాంగ్ టీజర్, రొమాంటిక్ విజువల్స్, యాక్షన్ సీక్వెన్సులు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. పలు మీడియా నివేదికల ప్రకారం.. 'కింగ్' సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్, థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్, ఓవర్సీస్ రైట్స్, మ్యూజిక్ అలాగే శాటిలైట్ లేదా టెలివిజన్ హక్కుల ద్వారా దాదాపు రూ. 800 కోట్లకు పైగా ప్రీ-రిలీజ్ బిజినెస్ లావాదేవీలను పూర్తి చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ భారీ డీల్స్ కారణంగా బాలీవుడ్ చిత్రసీమలో ఈ ప్రాజెక్ట్ అత్యంత భారీ క్రేజ్ సంపాదించుకున్న చిత్రంగా నిలిచింది. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ పెట్టిన నిర్మాణ వ్యూహం కూడా హాట్ టాపిక్ అయింది. 'కింగ్' సినిమా అంచనా బడ్జెట్ దాదాపు రూ. 350 కోట్ల నుండి రూ. 450 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. అంటే సినిమా విడుదలకు ముందే తన నిర్మాణ ఖర్చును సులభంగా అధిగమించడమే కాకుండా, పెట్టిన పెట్టుబడికి దాదాపు రెట్టింపు లాభాలను ప్రీ-రిలీజ్ డీల్స్ ద్వారా వెనక్కి రాబట్టినట్లు తెలుస్తోంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999